Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 06.07.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 05 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# గెలుపుతోనే మలుపు

- బలమైన అభ్యర్థుల ఎంపికే కీలకం
- చంద్రబాబును తక్కువ అంచనా వేస్తే తలక్రిందులే
- జాగ్రత్తపడితే జగన్‌దే రాజ్యం

ఎప్పుడొచ్చామా అన్నది ముఖ్యం కాదు, గెలిచామా లేదా అన్నదే ముఖ్యం. నేటి రాజకీయాలలో నడుస్తున్న ట్రెండ్ ఇది. ఒకప్పుడు వివిధ దేశాల మధ్య ప్రతిష్టాత్మకంగా జరిగే క్రికెట్ క్రీడ కూడా ఇప్పుడు వ్యాపారమైపోయింది. డబ్బులిస్తే ఆటగాళ్ళు ఏ జట్టులోనైనా ఆడుతున్నారు. రాజకీయాలలోనూ ఐపిఎల్ సంస్కృతి వచ్చేసింది. ఎలక్షన్‌ల నాటికి గెలుపుగుర్రాలను వెదుక్కోవడమే పార్టీల ప్రధాన పని అయ్యింది. ఈయన పార్టీకి పదేళ్ళు సేవచేసాడు, జెండాలు మోసాడు, బ్యానర్లు కట్టాడు, జిందాబాద్‌లు కొట్టాడని చెప్పి టిక్కెట్లు ఇవ్వడం లేదు. పది నిముషాల ముందు అవతల పార్టీలో వుండి ఇవతలకు వచ్చినా గెలుస్తాడనుకుంటే టిక్కెట్లిచ్చేస్తున్నారు. ఇప్పటి రాజకీయాలలో పోటీ చేసే అభ్యర్థికి కావాల్సింది పార్టీలో సీనియార్టీ కాదు... ఓటర్లను కొనే కెపాసిటి. ఓట్లు వేయించుకోగల కెపాసిటి. ఓట్లను తెచ్చుకోగల కెపాసిటి.

మాట తప్పం... మడమ తిప్పం అనే దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి పాలసీని అమలు చేయడం ఆయన కాలంలోనే చెల్లింది. తన హయాంలో తనను నమ్ముకున్న నాయకులకు గెలుపోటములతో సంబంధం లేకుండా ఆయన సీట్లిచ్చాడు. అయితే ఆరోజు పరిస్థితులు వేరు. ప్రజలలో కొంతన్నా విలువలు ఉన్నాయి. పనిచేసే (మిగతా 11వ పేజీలో)



# విషం కక్కి.. విద్వేషం రగిల్చి..

- హిందూ సంస్కృతిపై పెరిగిన దాడి

11లో



జననం 05.03.1945 శ్రీమతి వేమారెడ్డి పద్మావతి గారు మరణం 22.06.2018

## ఉత్తరక్రియలు

మమతలను మల్లెలుగా కూర్చి
మా మనసుల్లో మంచిని పెంచి
తిరిగిరాని లోకాలకు తరలివెళ్లిన మానవతామూర్తి

**శ్రీమతి వేమారెడ్డి పద్మావతి గారు**

తేది. 22.06.2018 శుక్రవారం స్వర్గస్తురాలైనారు.
వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త: వేమారెడ్డి జానకిరామిరెడ్డి

కుమారులు - కోడళ్ళు
శైలేంద్రరెడ్డి
వినీత్‌కుమార్‌రెడ్డి - సుమతి

కుమార్తెలు - అల్లుళ్ళు
లింగారెడ్డి లక్ష్మి - మధుసూధనరెడ్డి
జక్కా స్మిత - జనార్ధన్‌రెడ్డి

మనవళ్ళు, మనుమరాండ్రు
వేమారెడ్డి సువిన్‌యశ్వంత్‌రెడ్డి, వేమారెడ్డి భరత్‌రెడ్డి,
లింగారెడ్డి ఆశ్రిత, జె.కె.శ్రీవత్సరెడ్డి

**ఉత్తరక్రియలు:**
తేది. 12.07.2018 గురువారం కోవూరు, పాటూరురోడ్డులోని వారి స్వగృహం నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

# ముగిసిన వెంగమాంబ తిరునాళ్ళు



నెల్లూరుజిల్లా దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు వైభవంగా జరిగాయి. అయిదు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారి పుట్టినిల్లు నర్రవాడ పంచాయితీ వడ్డిపాలెంలో నిలుపు కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 1వ తేదీ రాత్రి పుట్టింట్లో పసుపు దంచే మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించారు. 2వ తేదీ అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. 3వ తేదీ అమ్మవారి గ్రామోత్సవం, 4వ తేదీ ఉదయం పసుపు, కుంకుమ ఉత్సవం, వెంగమాంబ, గురవయ్యల కళ్యాణం, 5వ తేదీ బండ్లు తిరుగుట, పొంగళ్ళు పెట్టడం, ఎడ్లబండ్ల లాగుడు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసారు. వెంగమాంబ ఆలయ ప్రధాన ముఖద్వారాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో రంగులరాట్నం, సర్కస్ ప్రదర్శనలు ఏర్పాటు చేసారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఆకట్టుకున్న సుగాలీల వీరతాండవం...** గ్రామోత్సవంలో సుగాలీల వీరతాండవం విశేషంగా ఆకట్టుకుంది. బైనేడి వాళ్ళ వాయిద్యాలకు పూనకంతో సుగాలీలు వీరతాండవం చేశారు. వివిధ వేషధారణలతో పలువురు కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. పండరిభజన కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది.

**వెంగమాంబకు బంగారు హారం...** వెంగమాంబకు తెద్దుపాడుకు చెందిన పచ్చవ వెంగయ్య, రాధ దంపతులు రూ.50వేలు విలువచేసే బంగారు హారాన్ని అమ్మవారికి బహుకరించారు.

# జిల్లాలో ఏపి టెట్‌కు 13,050 మంది

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపి టెట్) ఫలితాలు ఈ నెల 2న విడుదల చేసారు. మే నెలలో జరిగిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖాధికారులు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 15,143 మంది నాలుగు రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు రాశారని, వీరిలో వివిధ విభాగాల్లో 13,050మంది ఏపిటెట్ అర్హత సాధించారని జిల్లా విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎస్‌జిటిలో ఎ.సుమలత 140, వి.వెంకటేష్, 140, మహాలక్ష్మి, శరత్‌కుమార్ 139, ధనలక్ష్మి 138 అత్యధిక మార్కులు సాధించారు. అలాగే పేపర్-2 తెలుగులో 134మార్కులతో పి.లావణ్య జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిందని అధికారులు పేర్కొన్నారు.

# రాజరాజేశ్వరమ్మ హుండీ ఆదాయం

నెల్లూరు దర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి దేవస్థానంలోని హుండీలను ఈ నెల 3న లెక్కించారు. మార్చి 23 నుంచి జూలై 3వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.19,13,497లు ఆదాయం లభించిందని ఇ.ఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త రత్నం జయరాం, దేవాదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఆలయ ప్రధానార్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ మాల్యాద్రి కన్నుమూత

నెల్లూరుజిల్లాలోని దుత్తలూరు, వింజమూరు మండలాల్లో ప్రభుత్వ వైద్యాధికారిగా సేవలందిస్తూ ప్రజల డాక్టర్‌గా పేరొందిన దుత్తలూరు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి సిహెచ్ మాల్యాద్రి ఈ నెల 3న గుండెపోటుతో మరణించారు. గతనెల 30న ఆయనకు గుండెపోటు రావడంతో నెల్లూరు బొల్లినేని హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఈ నెల 3న తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన స్వస్థలం కొండాపురం మండలం తూర్పుఎర్రబల్లిపాలెం. వింజమూరు, దుత్తలూరు, ఆత్మకూరు, చాకలికొండ ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులుగా సేవలందించారు. మాల్యాద్రికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వింజమూరు ఎంపిపి గణపం కృష్ణకిరణ్‌రెడ్డి, సర్పంచ్ గణపం బాలకృష్ణారెడ్డి, మాల్యాద్రి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రతి మండలంలో ప్రత్యేక ప్రజావాణి

## - జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలోని 46మండలాల్లో ప్రత్యేక ప్రజావాణి(గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా దుత్తలూరు మండలం పరిషత్ కార్యాలయంలో ఈ నెల 2న నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాలను ఇప్పటివరకు దగదర్తి, నాయుడుపేటలో నిర్వహించామన్నారు. దుత్తలూరులో జరిగిన కార్యక్రమంలో ఎక్కువగా రెవెన్యూ, సర్వే సమస్యలు వచ్చాయన్నారు. జిల్లాలో ఇప్పటివరకు సిజెఎఫ్ఎస్ భూముల కోసం 16,500 ఎకరాలకు సర్వే చేసామన్నారు. అక్టోబర్ 2 నాటికి జిల్లాలో 65వేల మందికి 99,600 ఎకరాల సిజెఎఫ్ఎస్ భూములకు డికెటి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఉదయగిరి మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఎంపిపి రవీంద్రబాబు తదితరులు కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ భక్తవత్సల రెడ్డి, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

### నెల్లూరుజిల్లాకు

## ఐదుగురు తహశీల్దార్లు

నెల్లూరుజిల్లాకు అయిదు మంది తహశీల్దార్లను కేటాయిస్తూ సిసిఎల్ఏ ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటి (డిపిసి) నిర్వహించి 37మంది డిప్యూటి తహశీల్దార్లకు, తహశీల్దార్లుగా ఉదోన్నతులు కల్పించారు. 37మందిలో 22మందికి మాత్రమే గతంలో జిల్లాలో కేటాయించారు. పదోన్నతులు పొందిన మిగిలిన 15మందికి తాజాగా జిల్లాలో పోస్టులు కేటాయించారు. సిఆర్‌సిఏలో పనిచేస్తున్న పద్మావతి, ఆత్మకూరు డిటి సుబ్బయ్య, ఏఎస్‌పేట డిటి నాగరాజు, అల్లూరు డి.టి ప్రమీల, టిజిపిలో డిటిగా పనిచేస్తున్న రమాదేవిలకు తహశీల్దార్లుగా పదోన్నతులు కల్పించి నెల్లూరుజిల్లాకు కేటాయించారు.

### నేత్రపర్వంగా

## చాముండేశ్వరి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం గంగపట్నం చాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు గతనెల 19నుండి 30వ తేదీ వరకు వైభవంగా జరిగాయి.. 19వ తేదీ అంకురార్పణ, ధ్వజారోహణతో ప్రారంభమైన ఉత్సవాలు 20న చప్పర ఉత్సవం, 21న ఏనుగు వాహనం, 22న సింహ వాహనం, 23న పులివాహన ఉత్సవం, 24న అశ్వఉత్సవం, 25న పులి వాహన ఉత్సవం, 26న సింహ వాహన ఉత్సవం, 27న కల్యాణోత్సవం, 28న వసంతోత్సవం, గంగోత్సవం, 29న రథోత్సవం, 30న తెప్పోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయం వద్ద ఉపవాసదీక్ష ఆచరించిన భక్తులు నిప్పుల గుండాన్ని తొక్కి భక్తిని చాటుకున్నారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంతానం లేని మహిళలకు కొడిముద్దలు పంచిపెట్టారు. ఆలయ ఇఒ గడ్డం రవీంద్రరెడ్డి, ఛైర్మన్ పెనుబల్లి రామచంద్ర నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

### ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో...

# మూత్రసంబంధిత వ్యాధులపై సదస్సు



నెల్లూరు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతనెల 29న మూత్రసంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సు జరిగింది. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలోని యూరాలజీ విభాగంలో సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులు ఎన్. మల్లికార్జునరెడ్డి పాల్గొని అవగాహన సదస్సు నిర్వహించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్య నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మూత్రసంబంధిత వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్స్ హెచ్‌ఓడి(మార్కెటింగ్) కె.సత్యనారాయణ, అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, ఉపాధ్యక్షులు జివి కృష్ణయ్య, ఎన్.సాయి సుబ్బారావు, దొడ్ల జయరామానాయుడు, సంయుక్త కార్యదర్శి లక్కాకుల శ్రీనివాసులు, బి.సూర్యనారాయణ, కార్యనిర్వాహక సభ్యులు డా. కె. సూర్యనారాయణ, ముసునూరు పిచ్చయ్య, ఏ.శేషయ్య, పిగిలాం రంగయ్య, మాగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్స్‌డేని పురస్కరించుకుని ముందస్తుగా డాక్టర్ కోసూరు సూర్యనారాయణ, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ సిహెచ్ దొరస్వామినాయుడు, డాక్టర్ కె.సత్యనాథ్, డాక్టర్ ఎం.కాశయ్య, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జివివిఎస్ సత్యనారాయణలను అసోసియేషన్‌వారు సత్కరించారు.

# ఇక ఆన్‌లైన్‌లో..రవాణా సేవలు

## ఉపరవాణా కమిషనర్ శివరామప్రసాద్

రవాణాశాఖ సేవలన్నీ ఇక ఆన్‌లైన్‌లో ఉంటాయని, ఈ విధానాన్ని ఈ నెల 8వ తేది నుంచి అమలులోకి వస్తుందని ఉపరవాణా కమిషనర్ ఎన్.శివరామప్రసాద్ తెలిపారు. ఈ నెల 2న ఆర్టీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, వాహనదారులు ఇంటర్నెట్ ద్వారా ఇంటినుంచే తమ సేవలను వినియోగించుకోవచ్చునన్నారు. ఆ అవకాశం లేనివారు ఈ- సేవ, మీ-సేవ, కామన్ సర్వీస్ సెంటర్లకు వెళ్ళి తమ సేవలు ఉపయోగించుకోవచ్చన్నారు. దీంతో దళారుల సమస్య పూర్తిగా తొలగిపోతుందన్నారు. ప్రభుత్వ చలానా, ఫీజులు మాత్రమే చెల్లిస్తూ మెరుగైన సేవలు పొందవచ్చన్నారు. ఎల్ఎల్ఆర్ విభాగంలోని మూడు సేవలు, డ్రైవింగ్ లైసెన్స్ విభాగంలోని 13 సేవలు, రిజిస్ట్రేషన్ విభాగంలోని 15 సేవలు, పర్మిట్ విభాగంలోని 10 సేవలతో పాటు, బిడ్డింగ్ విధానంతో స్పెషల్, ప్రీమియర్ నెంబర్లు కూడా ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయన్నారు. ఏపిఆర్‌టిఏ సిటిజన్ డాట్, ఈ-ప్రగతి డాట్ ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో సమాచారం ఉందన్నారు. రోడ్డుప్రమాదాల నివారణ కోసం రోడ్‌సేఫ్టీ ఫండ్ నుంచి 30 బ్రీత్ ఎనలైజర్లు కొనుగోలుచేశామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. వాటిద్వారా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి వాహనాల వేగాన్ని నియంత్రించడంతో పాటు, నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే జిల్లాలో టాక్స్ చెల్లించని 22వేల మంది వాహనదారులను గుర్తించామని, జూన్ 30లోపు త్రైమాసిక పన్ను చెల్లించాలని నోటీసులు జారీచేశామని తెలిపారు. గడువులోపల టాక్స్ చెల్లించకుంటే ఆయా వాహనాల గుర్తింపు రద్దుచేసి సీజ్‌చేస్తామన్నారు.

# సంస్కృతి సమ్మేళనం అధ్యక్షుడిగా హరిచంద్రారెడ్డి



సంస్కృతి సమ్మేళనం అధ్యక్షుడిగా కనుమూరు హరిచంద్రారెడ్డిని ఎన్నుకున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి కె.మునిగిరీష్ తెలిపారు. గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటి హాలులో ఈ నెల 3వ తేదీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేళనం అధ్యక్షుడిగా సిద్దారెడ్డి జనార్ధన్‌రెడ్డి స్వచ్ఛందంగా తప్పుకున్నారని తెలిపారు. అనంతరం కనుమూరు హరిచంద్రారెడ్డిని అధ్యక్షుడిగా ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో యరగుడిపాటి చలపతిరావు, సోమిశెట్టి వెంచురామయ్య, జానా శివయ్య, కట్టా మురళీకృష్ణ, నిరంజన్, అనిల్‌కుమార్, జీజీ నాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చాలారోజుల తర్వాత ...



# బీజేపీ జెండా రెపరెపలు

## • విజయవంతంగా కన్నా పర్యటన

నెల్లూరుజిల్లాలో బీజేపీ ప్రాబల్యం తక్కువ. ఒకప్పుడు వున్న కేడర్ ఇప్పుడు లేదు. ఆ పార్టీ క్రమక్రమంగా బలహీన పడుతోంది. ఇటీవల పార్టీ కార్యక్రమాలు కూడా పెద్దగా వుండడం లేదు. జిల్లాకు చెందిన యం.వెంకయ్యనాయుడు కేంద్రంలో మంత్రిగా వుండి జిల్లాకు వస్తున్నప్పుడన్నా నాయకులు, కార్యకర్తలు జెండాలు బయటకు తీస్తుండేవాళ్ళు. ఆయన ఉపరాష్ట్ర పతిగా వెళ్ళడంతో ఏడాదికాలంగా ఆ పని కూడా లేకుండా పోయింది.

చాలారోజుల తర్వాత నెల్లూరులో బీజేపీ జెండా రెపరెపలాడింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పర్యటన పుణ్యమా అని బీజేపీ కార్యకర్తల్లో హుషారొచ్చింది. జెండాలు పట్టుకుని రోడ్ల మీదకొచ్చారు. వూరేగింపుగా కదిలారు.

ఈ నెల 3, 4 తేదీలలో జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ జిల్లా పర్యటన విజయవంతమైంది. రోడ్డుమార్గాన నెల్లూరుకు చేరుకున్న కన్నాకు 3వ తేదీ హైవేపైన సింహపురి ఆసుపత్రి వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అక్కడనుండి ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా బయలుదేరి రామలింగాపురం, విఆర్‌సి, ఆర్టీసీ బస్టాండ్‌ల మీదుగా కెవిఆర్ పెట్రోల్ బంకు సెంటర్‌లోని కస్తూరిదేవి గార్డెన్స్‌కు చేరుకున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సభకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి దాదాపు 3వేల మంది దాకా బీజేపీ కార్యకర్తలు తరలి వచ్చారు. ఇక్కడ జరిగిన సభలో కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం ప్రభుత్వ అవినీతిపై తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డాడు. చంద్రబాబు అవినీతిపాలనకు చరమగీతం పాడాలన్నారు. పోరాటయోధులకు, మహానాయకులకు నెల్లూరు జిల్లా పుట్టినిల్లు లాంటిదని, ఈ జిల్లాలో బీజేపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ జిల్లాకు 13ప్రాజెక్ట్‌లను కేంద్రమే ఇచ్చిందని, ఈ రాష్ట్రంలో ఏ అభివృద్ధి పని జరుగుతున్నా అది కేంద్రం నిధులతోనేనని చెప్పారు.

బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జమ్మల శ్యాంకిషోర్‌బాబు, దారా సాంబయ్య, కర్నాటి ఆంజనేయరెడ్డి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, విశ్రాంతి డిజిపి వి.దినేష్ రెడ్డి, కాకు విజయలక్ష్మి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మిడతల రమేష్, జెల్లి మధు, కరణం భాస్కర్, ఎం.ఈశ్వరయ్య, మొగరాల సురేష్, కాయల మధు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి ఓపెన్‌టాప్ జీప్‌లో వెళ్తున్న కన్నా

# అవినీతి అన్న.. కన్నా

## - బీద రవిచంద్ర ఎద్దేవా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అవినీతికి అన్నలాంటివాడని, ఆయన చంద్రబాబుపై ఆరోపణలు చేస్తుంటే ఒళ్ళంతా కితకితలుపెట్టినంత కామెడీగా వుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఎద్దేవా చేసారు. 4వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన కన్నా లక్ష్మీనారాయణ ఆ శాఖను అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చారని విమర్శించారు. అసలు బీజేపీకి కన్నా లక్ష్మీనారాయణను అధ్యక్షుడిగా నియమించింది జగన్మోహన్‌రెడ్డే! ఆయన కనుసన్నలలోనే ఈయన పని చేస్తున్నాడు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్ట్‌ల గురించి ఏ ఒక్క బీజేపీ నాయకుడు అడగడం లేదు. ఏపికి కేంద్రం చేస్తున్న ద్రోహంపై రాష్ట్ర బీజేపీ నాయకులు, వైసిపి నాయకులు నోరు మెదపడం లేదు. కాని రాష్ట్ర పునర్నిర్మాణం కోసం, ఏపి భవిష్యత్ కోసం రాత్రింబవళ్ళు కష్టపడుతున్న చంద్రబాబును మాత్రం ఆడిపోసుకుంటున్నారు. అసలు అపర భగీరథుడు, కృషీవలుడు చంద్రబాబుపై విమర్శలు చేయడానికి మీకు నోరెలా వస్తుందని బీద ప్రశ్నించారు.

ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు రాపూరు సుందరరామిరెడ్డి, రంగారావు, మొయినుద్దీన్, బి.మనోహర్‌రెడ్డి, హరిబాబు యాదవ్, కువ్వారపు బాలాజీ పాల్గొన్నారు.

# పేదలను ఆదుకున్న 'పేర్నాటి ట్రస్ట్'



విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తూ...

"పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నెల్లూరుజిల్లా కోట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదోతరగతి చదువుతున్న పిల్లలకు నోటు పుస్తకాలను, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్క విద్యార్థికి, అతిథులకు ఒక్కొక్క మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోట మండలంలోని పేద మహిళలకు 10 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పిల్లలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కోట మండలం తహసిల్దార్ రాజ్యలక్ష్మి, కోట మండల విద్యాధికారి ఎం.వి. సునీల్ కుమార్, మహావీర్ జైన్ ట్రస్ట్ సభ్యులు సోహన్‌రాజ్ పూనమ్‌చంద్ జీ, వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, పేర్నాటి స్నేహితులు, పేర్నాటి యూత్ పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తూ...


# నివాళి




రైతు బాంధవులు, మా ఆత్మబంధువు

## బెజవాడ దశన్నకి

అశ్రునివాళి.



తుంగా కుటుంబం

## 'ప్రభా'తం

# ప్రగతిబాటలో.. జీఎస్టీ

**దేశంలోనే ఎంతో చరిత్రాత్మకమైన వస్తుసేవల పన్ను విధానం..'జీఎస్టీ' అమలులోకి వచ్చి జూలై 1వ తేది నాటికి ఏడాది పూర్తయింది. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో పరోక్ష పన్నుల వ్యవస్థను ప్రక్షాళనం చేసి, ప్రపంచంలోనే అతిపెద్ద సంస్కరణగా పేరొందిన జీఎస్టీ అమలులో తొలి ఏడాది పూర్తయింది. ఒడిదుడుకులన్నీ తట్టుకుని, బాలారిష్టాలు దాటుకుని, ఈ ఏడాది వయసులోనే జీఎస్టీ లక్ష్యసాధన దిశగా అడుగులు వేసుకుంటూ మునుముందుకు సాగుతోండడం ఎంతో అభినందనీయం!**

'జీఎస్టీ'... దేశంలో ఏడాది క్రితం ఆవిర్భవించిన ఒక సరికొత్త పన్నుల వ్యవస్థ. దీంతో వృద్ధి, సరళత, పారదర్శకత సాధ్యమయాయి. రవాణా రంగానికి కొత్త ఊపు వచ్చింది. అది మన దేశ ఉత్పాదకతను పెంచుతోంది. అయితే, అన్నింటికీ ఒకే శ్లాబు ఉండాలని చెప్పడం సులభమే. కానీ, అలా చేయడం వల్ల ఆహారోత్పత్తులు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతాయి. కనుక, అన్నిటికీ ఒకే శ్లాబ్ విధానం అసాధ్యం!... - ప్రధాని మోడీ

దేశంలోనే ఎంతో చరిత్రాత్మకమైన వస్తుసేవల పన్ను విధానం..'జీఎస్టీ' అమలులోకి వచ్చి జూలై 1వ తేది నాటికి ఏడాది పూర్తయింది. ఏడుదశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో పరోక్ష పన్నుల వ్యవస్థను ప్రక్షాళనం చేసి, ప్రపంచంలోనే అతిపెద్ద సంస్కరణగా పేరొందిన జీఎస్టీ అమలులో తొలి ఏడాది పూర్తయింది. బాలారిష్టాలు దాటుకుని, ఒడిదుడుకులన్నీ తట్టుకుని ఈ ఏడాదిలో జీఎస్టీ అనుకున్న లక్ష్యసాధన దిశగా అడుగులు వేసుకుంటూ మునుముందుకు సాగుతోంది. ఇంకా కొన్ని ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నా జీఎస్టీ మండలి ఇప్పటికి సుమారు 27 సార్లు సంబంధిత అధికారులు, నిపుణులు, వ్యాపారవర్గాల వారందరితో సమావేశమై, సమస్యలను ఎప్పటికప్పుడు కూలంకుషంగా పరిశీలించి, అవసరమైన సర్దుబాట్లు, దిద్దుబాట్లు చేసుకుంటూ, దేశప్రగతికి మేలుబాటలు పరుస్తూ... జిఎస్‌టి తొలి ఏడాది దిగ్విజయంగానే పూర్తిచేసుకుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటి. దానిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే క్రమంలో కొన్ని ఇబ్బందులు సహజమే. అయితే, వాటన్నిటినీ సంయమనంతో పరిశీలించి పరిష్కరించుకుంటూ జీఎస్టీ ముందుకుసాగుతోంది.

తొలిదశలో జీఎస్టీపై రాష్ట్రాలు, అనేకవర్గాల వారితో భేదాభిప్రాయాలు వచ్చినా పరిశీలనల మీద పరిశీలనలు జరిపి చివరికి ఒక జీఎస్టీని క్రమబద్ధమైన వ్యవస్థగా రూపుదాల్చేందుకు కేంద్రం ఎంతో శ్రద్ధ తీసుకోవడం, తద్వారా అందరూ ఆశించినట్లుగానే ఈ కొంగ్రొత్త పన్నుల విధానం కొత్త పుంతలు తొక్కుతూ అభివృద్ధికి బాటలు వేస్తుండడం ఆహ్వానించదగిన పరిణామం. వ్యాపార, రవాణా రంగాలకు మేలుబాటలు పరిచే వ్యవస్థ ఇన్నాళ్ళకు..ఇన్నేళ్ళకైనా రావడం దేశానికి శుభపరిణామం. ఒక్కమాటలో చెప్పాలంటే, జీఎస్టీతో రవాణా రంగానికి కొత్త ఊపు వచ్చిందనడంలో సందేహం లేదు. గతంలో వలె తనిఖీలు, వేధింపులకు తావులేని వ్యవస్థ ఏర్పడడం, చెక్‌పోస్టులు రద్దుకావడం, సరకు రవాణా వేగం పుంజుకోవడం వంటి చర్యలతో పాటు. అత్యంతాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో అంతా ఆన్‌లైన్‌లోనే రవాణా వ్యవస్థ సేవలు అందుబాటులోకి రావడం, రిటర్న్‌లు దాఖలు చేయడం దగ్గరనుంచి అన్నీ ఆన్‌లైన్‌లోనే వేగవంతంగా, పారదర్శకంగా సాగిపోతుండడం ఎంతో విశేషం.

17 రకాల పన్నుల్నీ, 23 రకాల సెస్సుల్ని కలిపి ఒకే పన్నుగా.. జీఎస్టీ కిందకి తీసుకువచ్చాక, ఏడాదిలోనే పరోక్షపన్ను చెల్లింపుదారుల సంఖ్య 70 శాతం మేర పెరగడం ఎంతైనా ఊహించని పరిణామమే. దేశంలో ఇంతపెద్ద సంఖ్యలో పన్ను చెల్లింపుదారులు పెరగడం బహుశా ఇప్పుడే కావచ్చు. ఈ ఏడాది బడ్జెట్లో 12 లక్షల కోట్ల రాబడిని లక్ష్యంగా నిర్దేశించుకున్నా, దాని అదనంగా మరో లక్ష కోట్ల రూపాయలైనా వసూలు కావచ్చని కేంద్రం అంచనాలు వేస్తున్నదంటే, ఈ సరికొత్త పన్నుల వ్యవస్థ వల్ల దేశాభివృద్ధికి కలిగే ప్రయోజనం కన్నులకు కట్టినట్లే కనిపిస్తోంది. సులభతరమైన వ్యాపార నిర్వహణ మెరుగుపడడంతో పాటు, చిన్న-మధ్యతరహా వ్యాపార వర్గాలకు కూడా జీఎస్టీ వల్ల ఎంతో లబ్ధి కలుగుతోందనే చెప్పవచ్చు.

జీఎస్టీ వచ్చాక..ఈ ఏడాది వ్యవస్థలో 350 కోట్ల దాకా లావాదేవీలు జరిగాయని, 11 కోట్ల రిటర్న్‌లు దాఖలయ్యాయని గణాంకాలు వివరిస్తున్నాయి. జీఎస్టీ వల్ల ఇప్పుడు బియ్యం, గోధుమలు, చక్కెర, మసాలా దినుసులు వంటి నిత్యావసరాలతో సహా దాదాపు 400 రకాల వస్తువులపై పన్నులు తగ్గాయి. 150 రకాల వస్తువులపై పన్నులు లేవు. అనేక వస్తువులను 5 శాతం శ్లాబ్‌లోకే చేర్చారు. 95 శాతం వస్తువులు 18 శాతం కంటే తక్కువ పన్నుల్లోనే ఉన్నాయి. అయితే, దేశంలో అన్ని రకాల వస్తువులపై ఒకే శ్లాబ్ విధించడం మాత్రం సాధ్యం కాదు. అలా అన్నిటిపై 18 శాతం వంతున ఏకీకృత పన్ను విధిస్తే ఆహారోత్పత్తులు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతాయని, కనుక, అన్నిటికీ ఒకే శ్లాబ్ విధానం సరికాదనే ప్రధాని మోడీ మాటలు అర్థవంతమైనవి. జీఎస్టీ ఆశించిన లక్ష్యాలను సాధించే దిశలో పయనిస్తున్నదన్న మాట వాస్తవం.

అయితే, నిత్యావసరాలు తప్ప అన్నిటి ధరలు పెరిగిపోయాయంటూ వినియోగదారులు ఆందోళన చెందు తుండడాన్ని గమనించాలి. ముఖ్యంగా, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడల్లా ఆ భారం అటుతిరిగి ఇటుతిరిగి సామాన్యులు, మధ్యతరగతి ప్రజలపైనే పడుతోండడం విచారకరం. ఈ బాధలను కూడా పరిశీలించి ప్రజలకు ఎలాంటి అదనపు భారాల్ని మోపకుండా, పన్నుల వ్యవస్థను మరింతగా క్రమబద్ధీక రించడం అవసరం. ఏ సంస్కరణ అయినా అత్యధిక ప్రజల సంక్షేమాన్ని కాంక్షించాల్సి ఉంది. సామాన్యులు, మధ్యతరగతి ప్రజల బతుకుజీవనానికి ఇబ్బంది లేకుండా పన్నుల వ్యవస్థ ఉంటేనే అందరికీ మేలు జరుగుతుంది. ఆ దృష్ట్యా వస్తుసేవల పన్నుకు సంబంధించి ఇంకొంత పరిశీలన జరిగి, సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనసరళికి ఎలాంటి కష్టాలుకానీ, మోయలేని భారాలుకానీ లేకుండా జీఎస్టీలో ఇంకా మెరుగైన దిద్దుబాట్లు జరగాల్సి ఉంది.

పన్నుల సరళీకరణలోనూ అర్థవంతమైన, ఆదర్శవంతమైన విధానాలను అన్వేషించి అమలు చేసినప్పుడే.. జీఎస్టీకి మరింత సార్థకత ఏర్పడుతుంది. తద్వారా దేశ ఆర్థికవ్యవస్థకు, దేశప్రగతికి చేయూత నిచ్చినట్లవుతుంది. ద్వితీయ వసంతంలోనైనా ఇది నెరవేరుతుందని ఆకాంక్షిద్దాం!..జీఎస్టీ దేశానికి ఒక వినూత్నమైన..అత్యద్భుతమైన పన్నుల సంస్కరణ విధానంగా...చరిత్రాత్మకంగా నిలవాలని ఆశిద్దాం!

## నేత్రపర్వంగా.. శ్రీ శ్రీనివాసుని కల్యాణం



శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈనెల 1న నెల్లూరులోని టిటిడి కల్యాణమండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణమహోత్సవం టిటిడి అర్చకులు దాశరథి నారాయణాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా గోవిందనామస్మరణలతో, అన్నమయ్య సంకీర్తనలతో టిటిడి ప్రాంగణం మార్మోగింది. సివి సుబ్రహ్మణ్యం, కొండా శేఖరరెడ్డి, వేమిరెడ్డి సనత్‌కుమార్ రెడ్డి, డా. భానుప్రకాష్, గంటా రమణయ్య నాయుడు, రమానాయుడు, రాజేష్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. గుండాల గురవయ్య ఆలపించిన అన్నమయ్య కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. టిటిడి హిందూ ధర్మప్రచారపరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు.

## క్రీడాభివృద్ధికి కృషి - శాప్ ఛైర్మన్ అంకమ్మ చౌదరి

రాష్ట్రంలోని 13జిల్లాల్లో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఛైర్మన్ పి.అంకమ్మచౌదరి పేర్కొన్నారు. గత నెల 30న నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి క్రీడామైదానంలో క్రీడా అసోసియేషన్‌తో ఆయన సమావేశమయ్యారు. పాఠశాల స్థాయి నుంచి జూనియర్, డిగ్రీ కళాశాల వరకు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు త్వరలో 'సిఎం కప్' పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో క్రీడా నూతన విధానాల్లో భాగంగా బడ్జెట్‌లో రూ.300కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి రాష్ట్ర ముఖ్యమంత్రి క్రీడలకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు.




## లగడపాటేం బ్రహ్మ కాదు

ఎన్నికల ఫలితాలను ముందుగా అంచనా వేయడం నాలుగు తలకాయల బ్రహ్మకే సాధ్యం కాదు. లగడపాటి రాజగోపాలెం పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కాదు కాలజ్ఞానం చెప్పడానికి. లగడపాటికి దేశం నిండా అప్పులున్నాయి. అందుకే ఆయా ప్రభుత్వాలకు అనుకూలంగా సర్వేలిస్తున్నాడు. ఇండియాటూడే, ఇతర సంస్థల ఎగ్జిట్‌పోల్స్ ఎన్నోసార్లు విఫలమయ్యాయి. లగడపాటి తెలుగుదేశం తొత్తు. ఆయన విజయవాడ ఎంపీగా గెలవడానికి ఇదొక ఎత్తు. ఈసారి జగన్ ముఖ్యమంత్రి అవుతాడు. ఇది నూటికి నూరుపాళ్ళు జరిగే సత్యం.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## కత్తి... పెద్ద సుత్తి

టీవీ 9 ఛానెల్‌వాళ్ళు పనీ పాటా లేని పోరంబోకులను చాలామందిని చేరదీసి ఆశ్రయం కల్పిస్తున్నారు. సినీ నటుడు శివాజీ అనే దగుల్బాజీ వీరి సంస్థలో అటెండర్‌లా తయారయ్యాడు. ఇక గోగినేని బాబు అనే ఛండాలుడొకడు. వీడికి అవతలివారి మనోభావాలు పట్టవు. ఈమధ్య కత్తి మహేష్ అనే సుత్తిగాణ్ణి పెంచి పోషిస్తున్నారు. కోట్లాదిమంది హిందువులు ఆరాధించే శ్రీరాముడిని ఈ నీచుడు అనరాని పదాలతో దూషిస్తున్నాడు. ఇలాంటి వారిచేత హిందువుల మనోభావాలను దెబ్బతినేలా చేస్తున్న టీవీ9 ఛానెల్‌ను హిందువులందరు కూడా చూడడం మానుకోవాలి. హిందువులలో ఐక్యత లేకనే వీళ్ళు అన్ని వేషాలేస్తున్నారు. హిందువులు ఏకమైతేనే ఈ దగుల్బాజీలకు బుద్ధొస్తుంది.

- సి.రాజీవి, నెల్లూరు.

## దొంగదీక్షలతో ఏం సాధిస్తారు?

చిత్తశుద్ధి లేని శివపూజలేలా అన్నట్లు... చిత్తశుద్ధి లేని ఉద్యమాలు కూడా ఎప్పుడూ విజయవంతం కావు. కడపలో ఉక్కుదీక్ష అంటూ ఎంపీ సీఎం రమేష్ చేసిన ఆమరణ నిరాహార దీక్ష నవ్వులపాలైంది. సీఎం రమేష్ పట్ల ప్రజలలోనే కాదు, సొంత పార్టీలోనూ సదభిప్రాయం లేదు. ఆయన అక్రమార్జనల గురించి అందరికీ తెలుసు. నాలుగేళ్ళుగా ఎన్డీఏ ప్రభుత్వంలో వున్నప్పుడు ఏనాడూ కడప ఉక్కు కర్మాగారం గురించి ప్రస్తావించలేదు. కనీసం ప్రయత్నించలేదు. ఇప్పుడు ఎన్డీఏ నుండి బయటకురాగానే ఉక్కుదీక్ష అంటూ నిరాహారదీక్షకు కూర్చుంటే అది డ్రామా అని తెలుసుకోలేనంత అమాయకత్వంతో ప్రజలున్నారా? దానికి తోడు చేసిన దీక్ష కూడా దొంగ దీక్షే. శుభ్రంగా తింటూ, తాగుతూ చేసారు. ఈ తొక్కలో దీక్షకు ముఖ్యమంత్రి వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేయడం. ఈ డ్రామా వద్దకు జేడీ లక్ష్మీనారాయణ కూడా వచ్చి తన పరపతి పోగొట్టుకున్నాడు. ప్రజలకు రాజకీయ నాయకులు ఏమీ చేయక పోయినా పర్వాలేదు... ఇలా దొంగ దీక్షలు చేసి రాజకీయ విలువలను దిగజార్చడం మంచిది కాదు.

సానా బాలగురవారెడ్డి, బద్వేల్.

## ఆదర్శ ప్రజానాయకుడు శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేటి తరం ప్రజాప్రతినిధులకు ఆదర్శప్రాయం. ఆయన కుమార్తె వివాహం ఇటీవల జరిగింది. పెళ్ళి పిలుపుల వద్ద నుండి పెళ్ళి మండపం వద్దకు పెళ్ళికి వచ్చిన వారిని ఆహ్వానించడం అనంతరం పెళ్ళికి హాజరైన వారికి ఏర్పాటు చేసిన విందు అందరికీ అందించే విషయంలో శ్రీధర్‌రెడ్డి పేద గొప్ప తారతమ్యం లేకుండా అందరి పట్ల సమభావం చూపి తన ఆదర్శాన్ని చాటుకున్న తీరు అభినందనీయం. సామాన్యులను సైతం పేరు పేరునా గుర్తించుకొని వారిని తన కుమార్తె వివాహానికి రావాలని ఆయన పిలిచిన తీరు సామాన్యులను ఎంతగానో సంతోషపరిచింది. కేవలం పిలవడం వరకే కాకుండా పెళ్ళికి వచ్చిన వారిని కూడా అదే ప్రేమాభిమానాలతో పలకరించి తన మంచి మనసును చాటుకున్నారు.

- ఎస్.బాబురావు, కావలి.

# కోటంరెడ్డి వారి పెళ్లిసందడి





నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి - సుజితల రెండవ కుమార్తె **వైష్ణవి - నవిన్**(ఖమ్మం వాస్తవ్యులు గొర్రెపాటి నరసింహరావు - నాగమణిల కుమారుడు)ల కళ్యాణం ఈ నెల 1వ తేదీ నెల్లూరు, కస్తూరిదేవి గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు వివిధ జిల్లాల్లోని రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, అన్నింటికంటే ముఖ్యంగా వేలాది సంఖ్యలో నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ ప్రజలు అతిథులుగా విచ్చేసి నూతన వధూవరులను 'శతమానం భవతి' అంటూ దీవించారు. అలాగే 2వ తేదీన కొత్తజంట తూర్పుగోదావరి జిల్లాలో పాదయాత్రలో వున్న వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసి ఆయన ఆశీస్సులను కూడా అందుకున్నారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



## 2019...

# రేస్ గుర్రాలు వీళ్ళే!

***ఐదేళ్ళకోసారి ఎన్నికలొస్తుంటాయి. అలాగే ప్రతి ఎన్నికలకు కొందరు కొత్త నాయకులు వస్తుంటారు. కొందరు నాయకులు తెరమరుగవుతుంటారు. ప్రతి ఎలక్షన్ ఎంతోకొంతమంది కొత్తవారిని మనకందిస్తూనేవుంటుంది. 2014 ఎలక్షన్ ఇలాంటిదే! ఆ ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా గెలిచిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కోవూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలుగా గెలిచిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణలు తప్పితే జిల్లాలో ఎన్నికైన మిగతా 8మంది ఎమ్మెల్యేలు శాసనసభలోకి కొత్తగా అడుగుపెట్టినవాళ్ళే! 2014 అసెంబ్లీకి నెల్లూరుజిల్లా నుండి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, పాశం సునీల్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డిలు కొత్తగా అడుగుపెట్టారు.***

మరి 2019 అసెంబ్లీకి ఎంతమంది పాతవాళ్ళు పోబోతున్నారు, ఎంతమంది కొత్త వాళ్ళు రంగంలోకి దిగబోతున్నారన్నది ప్రశ్న? ముఖ్యంగా ఒకప్పుడు ఎన్నికలు వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌ల మాదిరిగా వుండేవి. ఏ పార్టీ తరపున ఎవరు అభ్యర్థి అన్నది ముందుగానే ఫిక్స్ అయ్యుండేది. ప్రధానంగా పోటీ చేసే అభ్యర్థులు కూడా పార్టీ మీద అభిమానముండే పోటీ చేసేవాళ్ళు. ఇప్పుడు ఎన్నికలు ఐపిఎల్ మ్యాచ్‌లు మాదిరిగా తయారయ్యాయి. ఎలక్షన్ ముందే గెలుపు గుర్రాలను కొనుక్కోవడమన్న మాట. ఇక్కడ పార్టీ ఫీలింగ్, సిద్ధాంతం, అభిమానం అన్నవి చివరి స్థానంలో వుంటాయి. గెలవగలిగే సామర్ధ్యమే ప్రధానంగా వుంటుంది. ఐపిఎల్‌లాగానే ఎలక్షన్ ముందు ఈపిఎల్(ఎలక్షన్ ప్రీమియర్ లీగ్) వుంటుంది. ఈ కోణంలో చూస్తే కొందరు నాయకులను తెరమీదకు తీసుకురావచ్చు.

**వైసిపి నుండి చూస్తే...** సిటింగ్ ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతంరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు ఎలాగూ రంగంలో వుంటారు. వీళ్ళు కాకుండా ఆయా స్థానాలకు సంబంధించి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మేరిగ మురళీధర్, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, బత్తిని విజయ్‌కుమార్ వంటి నాయకులు టిక్కెట్ల రేస్‌లో వున్నారు.

**తెలుగుదేశం నుండి చూస్తే...** సిటింగ్ ఎమ్మెల్యేలుగా బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు ఎలాగూ రేస్‌లో వున్నారు. వీళ్ళు కాకుండా టీడీపీ తరఫునే ఆయా స్థానాల నుండి బీద మస్తాన్‌రావు, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, బొల్లినేని హజరత్తయ్యనాయుడు, గూటూరు కన్నబాబు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్‌రావు, జ్యోత్స్నలత, పరసారత్నం, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పి.నారాయణ, అబ్దుల్ అజీజ్, తాళ్ళపాక అనూరాధ వంటివారి పేర్లు రేస్‌లో వున్నాయి.

ఇక ప్రస్తుతానికి తెలుగుదేశం, కాంగ్రెస్, బీజేపీ వంటి పార్టీలలో వున్నప్పటికీ టీడీపీ లేదా వైసిపి టిక్కెట్ల రేసులో ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పనబాక కృష్ణయ్యలు ఉండడం విశేషం!










## నెల్లూరు పోలీస్ కార్యాలయాలకు

# హైటెక్ సొగసులు

మనం హైదరాబాద్‌కు వెళ్ళినప్పుడు సైబరాబాద్ కమిషనరేట్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌లు చూసినప్పుడు... ఇలాంటి పోలీసుస్టేషన్‌లు మనకు కూడా వస్తే ఎంత బాగుండు అనుకుంటాం... ఎందుకంటే అవి పోలీసుస్టేషన్‌ల మాదిరిగా వుండవు. కార్పొరేట్ కంపెనీల ఆఫీసుల్లాగా వుంటాయి. ఈమధ్య ఉత్తమ పోలీసుస్టేషన్‌గా కూడా పంజాగుట్ట పోలీసుస్టేషన్‌ను ప్రకటించడం తెలిసిందే! పోలీసుస్టేషన్‌లను పాడుబడిపోయిన బంగ్లాలు, భవనాలలో చూసిన మనకు కొత్తగా కట్టిన ఇవి అద్భుతంగా కనిపిస్తాయి. ఇలాంటి అద్భుతాలే ఇప్పుడు నెల్లూరు నగరంలోనూ వెలిసాయి.

నెల్లూరుజిల్లా పోలీసు శాఖ హైటెక్ సొగసులద్దుకోనుంది. ఇప్పటివరకు జిల్లా పోలీసు కార్యాలయం బ్రిటీష్ హయాంలో కట్టిన భవనంలో కొనసాగింది. కాని ఇప్పుడు జిల్లా పోలీసు కార్యాలయం సరికొత్త భవనంలోకి మారబోతోంది. డికెడబ్ల్యూ కాలేజీ పక్కనే, గతంలో పోలీసు క్వార్టర్స్ వున్న ప్రాంతంలో నూతన పోలీసు కార్యాలయాన్ని ఎంతో అందంగా, హైటెక్ కంపెనీ తరహాలో నిర్మించారు. దీనిని ఈ నెలలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నారు. అలాగే పోలీస్‌గ్రౌండ్ పక్కనే నెల్లూరు రూరల్ పోలీసు కార్యాలయాన్ని ఎంతో అధునాతనంగా నిర్మించారు. నెల్లూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నాలుగో నగర పోలీసుస్టేషన్‌ను కూడా కార్పొరేట్ ఆఫీసులాగా కట్టిపెట్టారు. ఇవన్నీ ఒకేరోజు ప్రారంభించబోతున్నారు.



నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




# నెల్లూరు కబుర్లు

## ప్రధాని వస్తున్నాడు



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 22వ తేదీన జిల్లాలోని శ్రీహరికోట షార్ సెంటర్‌కు రానున్నట్లు తెలుస్తోంది. భారీ రాకెట్ ప్రయోగాలకు అనువుగా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 630కోట్ల వ్యయంతో షార్‌లో నిర్మించిన రెండో వాహన అనుసంధాన భవనాన్ని(సెకండ్ వెహికల్ అసెంబ్లీ బిల్డింగ్)ను ఆయన ప్రారంభించనున్నారు. భవిష్యత్‌లో ప్రతి ఏటా 12రాకెట్ ప్రయోగాలు జరపాలని ఇస్రో నిర్ణయించింది. దీనికి అనుగుణంగానే రెండో వాహన అనుసంధాన భవనాన్ని నిర్మించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి వుంది.

## ఈ నెలలోనే మళ్ళీ సీఎం



జూన్‌లో రెండుసార్లు జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెలలో మరోసారి జిల్లా పర్యటనకు వచ్చే అవకాశాలున్నాయి. పోయిన నెలలో రెండుసార్లు కూడా సభలతో సరిపెట్టారు. ఈసారి పర్యటనలో అన్నీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలే ఉండబోతున్నాయి. దగదర్తి విమానాశ్రయానికి ఈసారి ఖచ్చితంగా శంకుస్థాపన చేసే అవకాశముంది. అలాగే గొలగమూడి ఆశ్రమంలోనూ నూతన భవనాల ప్రారంభోత్సవం జరుగనుంది. వెంకటేశ్వరపురం వద్ద నిర్మించిన 'హౌస్ ఫర్ ఆల్' గృహ సముదాయాలను ప్రారంభించే అవకాశముంది. నెల్లూరుజిల్లాలో అధునాతనంగా నిర్మించిన జిల్లా పోలీసు కార్యాలయం భవనంతో పాటు నెల్లూరు రూరల్, నెల్లూరు నాలుగో నగర పోలీసుస్టేషన్ భవనాలను, అలాగే అన్న క్యాంటీన్‌లను ఆయన ప్రారంభించే అవకాశాలున్నాయి.

### నెల్లూరులో
## ఐటి కంపెనీలు ఏర్పాటు చేయండి

- ఫ్లెక్సీతో సిఎంకు 'మన మను ఆర్గనైజేషన్' వినతి




నెల్లూరు రూరల్ ప్రాంతంలో ఐటి కంపెనీలు ఏర్పాటు చేయాలని 'మన మను ఆర్గనైజేషన్' సంస్థ వ్యవస్థాపకుడు మనుక్రాంత్‌రెడ్డి కోరారు. ఇటీవల నెల్లూరులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన సందర్భంగా ఆ సంస్థ కార్యాలయ భవనంపై ఫ్లెక్సీని చేతపట్టుకుని తమ వినతిని తెలిపారు. ఈ సందర్భంగా మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ, గత పన్నెండేళ్ళుగా హైదరాబాద్‌లో కొనసాగుతున్న తమ మష్కాం టెక్నాలజీ సంస్థను నెల్లూరులో ఏర్పాటుచేసి గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నెల్లూరు గ్రామీణ ప్రాంతాల్లో ఐటి కంపెనీలు ఏర్పాటు చేస్తే ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లవుతుందని విజ్ఞప్తి చేశారు.

## ఏటూరుకు కవుల అభినందన


ఏటూరి నాగేంద్ర దంపతులను సత్కరిస్తున్న కవులు

ప్రముఖ కవి, సాహితీవేత్త ఏటూరి నాగేంద్రరావు 35సంవత్సరాలు రైల్వే శాఖలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి గత నెల 30న పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఈ నెల 1వ తేదీ బంధుమిత్రుల సమక్షంలో అభినందన కార్యక్రమం జరిగింది. ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, కథా రచయిత దగ్గుమాటి పద్మాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఏటూరి నాగేంద్రరావుతో తమకున్న స్నేహాన్ని, అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ విమర్శకులు కాళిదాసు పురుషోత్తం, ఏటూరి నాగేంద్రరావు కవిత్వం గురించి, కవిత్వంలో ప్రతిఫలించే ఆయన వ్యక్తిత్వం గురించి వివరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కె.వి.చలమయ్య, రాంజీ, గుర్రాల రమణయ్య, వంజవాక సతీష్, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొని నాగేంద్రరావును అభినందించారు.

## సీఎం వస్తే సెలవివ్వాలా?

జిల్లాలో వేసవి సెలవులు ముగిసాక బళ్ళు తెరిచారనే గాని... మళ్ళీ ఎండలు ముదిరాయని, బందలనో అడపాదడపా సెలవులొస్తూనే వున్నాయి. అన్నింటికి మించి జూన్ 30వ తేదీన నెల్లూరులోని పాఠశాలలకు సెలవు ఇవ్వడమే విచిత్రంగా వుంది. ఆరోజు సీఎం వస్తున్నాడని చెప్పి స్కూళ్ళకు సెలవు ఇచ్చేసారు. సీఎం వస్తే స్కూళ్ళు మూసేయాలా? ఈ విడ్డూరం ఎప్పుడూ లేదు. అదేమంటే ట్రాఫిక్ సమస్యంటున్నారు. అసలు విషయం అది కాదు. సీఎం సభకు ప్రైవేట్ స్కూల్స్ బస్సులను వాడుకోవాలి. స్కూళ్ళు పెడితే ఆ బస్సులను వాడుకోవడం కుదరదు. అందుకే తాపీగా స్కూళ్ళకు సెలవిచ్చేసారు. పార్టీ కార్యక్రమాలకు కూడా బళ్ళను మూసేస్తే పిల్లకాయల చదువులే సంకనాకిపోతాయి.

### 'అనంత' గర్జనలో
## నెల్లూరు నాయకులు

అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 2న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నయవంచన, విభజన చట్టంలోని హామీలు అమలు చేయకపోవడం, బీజేపీ, టిడిపి నేతల తీరును ఎండగడుతూ నిర్వహించిన "వంచనపై దీక్ష" కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి జనం తరలివెళ్ళారు. ఈ సభలో నెల్లూరు, తిరుపతి మాజీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వెలగపల్లి వరప్రసాద్‌రావు, కావలి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వైయస్సార్సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మూలస్థానేశ్వరుని ఆదాయం
## రూ. 6.46లక్షలు

నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో గత నెల 30న హుండీలను లెక్కించారు. హుండీల ద్వారా స్వామి వారికి మూడు నెలల ఎనిమిది రోజులకు గాను రూ.6,46,856లు ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.వేణుగోపాల్ తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ఆర్.చైతన్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

## దళిత తేజం దద్దరిల్లింది

**- నుడా శీనయ్య**

నెల్లూరులో ఏర్పాటు చేసిన దళిత తేజం - తెలుగుదేశం సభ లక్షలాది జనంతో కిక్కిరిసిపోతే ఆ సభకు 8వేల మంది కూడా రాలేదని వైసిపి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించడం విడ్డూరంగా వుందని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య విమర్శించాడు. 2వ తేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డిలాగానే జిల్లాలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా తలాతోక లేకుండా మాట్లాడుతున్నాడని అన్నాడు. మా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీద దొంగపత్రాలు సృష్టించి అభాసుపాలయ్యావు. సర్వేపల్లిలో మా మంత్రి చేస్తున్న అభివృద్ధి పనులకు అడుగడుగునా అడ్డుపడుతున్నావు. దళితతేజం సభకు మేం ఆర్టీసీకి నయాపైసా తక్కువ కాకుండా డబ్బులు కట్టి బస్సులు తెచ్చుకున్నాం. దళితులకు ద్రోహం చేసింది మీరు, దన్నుగా నిలిచింది తెలుగుదేశం పార్టీ. ఎవరు దళితులను ఉద్ధరించారనేదానిపై బహిరంగ చర్చకు నేను సిద్ధంగా వున్నాను. దమ్ముంటే నా సవాల్‌ను స్వీకరించండి... రాబోయే ఎన్నికల్లో వైసిపిని ప్రజలు పూర్తిగా మట్టుబెట్టనున్నారని శీనయ్య పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ధర్మవరం సుబ్బారావు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, పిండి సురేష్, కువ్వారపు బాలాజీ, జలదంకి సుధాకర్, పసుపులేటి మల్లికార్జున్, ఎం.పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



### అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా
## కోట సూర్యనారాయణ

నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సింహపురి పెయింట్స్ అండ్ హార్డ్‌వేర్స్ అధినేత కోట సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పనిచేసారు. తన హయాంలో సంఘంకు సొంత భవనం నిర్మించడంతో పాటు ఆర్యవైశ్యులకు సంబంధించి పలు కార్యక్రమాలు పూర్తి చేశాడు. 2018-20 సంవత్సరానికి గాను సంఘంకు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి వచ్చింది. ఈ నెల 1వ తేదీన సంఘం అధ్యక్ష పదవికి కోట సూర్యనారాయణ నామినేషన్ దాఖలు చేసాడు. మరో ముగ్గురు కూడా నామినేషన్ దాఖలు చేయగా, ఆర్యవైశ్య ప్రముఖులు వారికి నచ్చజెప్పి, వివాదరహితుడైన కోట సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు వారి చేత నామినేషన్లు ఉపసంహరించేలా చేసారు. సోమవారం నెల్లూరు, స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌తో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని సూర్యనారాయణను అభినందించి, ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.


కోట సూర్యనారాయణను సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

## క్యాన్సర్‌పై అవగాహన సదస్సు


డా॥ హరితకు జ్ఞాపికను అందజేస్తున్న చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఈనెల 1న నగరంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ హరిత మాట్లాడుతూ, క్యాన్సర్ దరిచేరకుండా ఉండాలంటే ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండాలన్నారు. తరచూ క్యాన్సర్ పరీక్షలు చేసుకోవడం ద్వారా ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ హరితను ఘనంగా సత్కరించారు. చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శింగంశెట్టి మురళీమోహన్‌రావు, వ్యవస్థాపక కార్యదర్శి పాముల రమణయ్య, అపోలో ఆసుపత్రి పిఆర్ఓ విజయకుమార్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శివప్రసాద్‌నాయుడు, వంశీ, బి.బలరామిరెడ్డి, కొండూరు శేషారెడ్డి, ఎల్.బాబు, కె.పెంచలనాయుడు, లక్ష్మీనరసయ్య, సురేష్‌చౌదరి, జి.దయాకర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రులకు...
# దీటుగా ప్రభుత్వాసుపత్రులు
### - మంత్రి సోమిరెడ్డి


సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా అత్యంత ఆధునిక వసతులతో ప్రభుత్వాసుపత్రులను ఏర్పాటుచేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 3న ఆయన వెంకటాచలం మండలంలో 4.33 కోట్లతో నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా గుర్తించామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, కోడూరుతో పాటు వెంకటాచలంలో అత్యాధునిక వసతులతో ఆసుపత్రుల నిర్మాణాలు చేపట్టామన్నారు. పొదలకూరు ఆసుపత్రిలో అత్యాధునిక కంటి చికిత్సల విభాగాన్ని ప్రారంభించి, ఉచితంగా కంటి వైద్యసేవలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో ఎప్పుడూ జరగనంత అభివృద్ధి ఈ నాలుగేళ్ళలో జరిగిందన్నారు. రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ అన్ని శాఖలు వినూత్న పథకాలు అమలుచేస్తున్నాయన్నారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఇటీవల నెల్లూరులో దళితతేజం-తెలుగుదేశం సభ విజయవంత మైందన్నారు. దళితులకు ఉచిత విద్యుత్‌ను 75 నుంచి 100 యూనిట్లకు పెంచడం జరిగిందని, దళితులకు ఇళ్ళ యూనిట్లు విలువ పెంపు, ఇళ్ళ స్థలాల కేటాయింపునకు 250 కోట్లు, ఎస్‌సి కాలనీల్లో అప్రోచ్‌రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు తదితర కీలక నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంటున్నదన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సహకారంతో రుబ్బన్ పథకంలో భాగంగా వెంకటాచలం మండలంలోని 18 గ్రామాల రూపురేఖలే మారిపోయాయని, ఆ పథకంతో ఆ గ్రామాలు ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో సర్వేపల్లి టిడిపి సమన్వయకర్త ఎస్.రాజగోపాల్‌రెడ్డి, వెంకటాచలం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ మందల మోహన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సి.రమాదేవి, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గాలేటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళితులను..
# దగా చేసింది చంద్రబాబే!


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

రాష్ట్రంలో దళితులను దగా చేసింది, వాళ్ళను అవమానపరిచే రీతిలో మాట్లాడింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని, అలాంటి నాయకుడు ఇప్పుడు దళితతేజం సభలో దళితులను ఉద్ధరిస్తోంది తామే అన్నట్లు మాట్లాడడం సిగ్గుచేటని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. ఈ నెల 2వ తేదీ నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దళితులకు తెలుగుదేశం పాలనలో జరిగిన లబ్ది గురించి శ్వేతపత్రం విడుదల చేసే దమ్మూ ధైర్యం ముఖ్యమంత్రికి ఉందా అని ప్రశ్నించారు. దివంగత నేత వై.యస్.రాజశేఖర్‌రెడ్డి పాలనలో 35లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగితే, అందులో ఎస్సీ, ఎస్టీలకు 7లక్షల ఎకరాలకుపైగా పంచిన మాట వాస్తవం కాదా అని ప్రకటించారు. అలాగే, వై.యస్. హయాంలో 45లక్షల ఇళ్ళు నిర్మిస్తే, అందులో సింహభాగం ఎస్సీ ఎస్టీలదేనన్నారు. ఇప్పుడు తెలుగుదేశం 3లక్షలు విలువజేసే ఇళ్ళను 6లక్షల రూపాయలకు దళితులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, ఎండి ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్, వైసిపి నాయకులు దార్ల వెంకటేశ్వర్లు, వందవాసి రంగ, హంజా హుస్సేని, కొప్పోలు చంద్రశేఖర్, కాయల సురేష్, గంధం సుధీర్, అజయ్ పాల్గొన్నారు.




# దళిత తేజం... ధగధగ

- రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చిన దళితులు

రాష్ట్ర వ్యాప్తంగా 120రోజుల పాటు జరిగిన 'దళిత తేజం తెలుగుదేశం' కార్యక్రమం జూన్ 30వ తేదీన నెల్లూరులో ముగిసింది. నెల్లూరు హైవే పక్కన ఎస్‌విజిఎస్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన 'దళిత తేజం తెలుగుదేశం' ముగింపు సభకు రాష్ట్రంలోని 13జిల్లాలు, 175నియోజకవర్గాల నుండి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను పెట్టి దళితులను ఈ సభకు తరలించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేల కుర్చీలు సభకు వచ్చిన వారితో నిండిపోగా, కుర్చీలు లేక మరికొందరు నిలబడి పోయారు. భారీగా తరలివచ్చిన వాహనాల కోసం హైవేకు ఇరువైపులా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడంతో హైవేపై ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తలేదు. వచ్చిన ప్రజలకు భోజనం, మంచినీళ్ళు వంటివి లోటులేకుండా ఏర్పాటు చేసారు.

ఈ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన ప్రసంగంలో దళితుల కోసం ఈ నాలుగేళ్ళలో తెలుగుదేశం ప్రభుత్వం ఏమేం చేసిందో ముప్పావుగంట సేపు వివరించారు. దళితుల అభ్యున్నతి కోసం 4ఏళ్ళలో 40వేల కోట్లు ఖర్చు చేసామన్నారు. ఇంత చేసినందుకు తనకు దళితులు దన్నుగా నిలవాలని కోరారు. మతం మారిన క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మౌలిక సదుపాయాల కోసం ఈ ఏడాది 11500కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ యువతులకు చంద్రన్న పెళ్ళికానుక క్రింద 40వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. అమరావతిలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలా దళితులకు చేసినవి, చేయాలనుకున్నవి చంద్రబాబు తన ప్రసంగంలో వివరించారు.

ఈ సభలో మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, అమర్‌నాథ్‌రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, నక్కా ఆనంద్‌బాబు, పరిటాల సునీత, జవహర్, పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమామహేశ్వరరావు, భూమా అఖిలప్రియ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఆయా కార్పొరేషన్‌ల ఛైర్మెన్‌లు, టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర నేతృత్వంలో దళిత తేజం సదస్సు విజయవంతంగానే ముగిసింది.





# ఆల్కహాల్ తీసుకోని వారిలోనూ లివర్ వ్యాధులు


డాక్టర్ జాయ్ వర్గీస్

- త్వరగా గుర్తించకపోతే ప్రమాదకరమే
- ప్రపంచంలో 30శాతం మందికి ఈ తరహా లివర్ సమస్యలు
- లివర్ వ్యాధుల లక్షణాలు గుర్తించలేము
- మాస్టర్ హెల్త్ చెకప్‌లతోనే లివర్ వ్యాధుల గుర్తింపు సాధ్యం
- లివర్ వ్యాధులపై అవగాహన కల్పించిన నెల్లూరు అపోలో స్పెషాలిటీ వైద్యులు

నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ వైద్యశాలలో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో జర్మనీ దేశ ఫెలోషిప్ గ్రహీత, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ జాయ్ వర్గీస్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించని వారిలో వచ్చే లివర్ వ్యాధులను నాన్ ఆల్కహాలిక్ లివర్ వ్యాధులంటారని తెలిపారు. ముఖ్యంగా ఫ్యాటీ లివర్ సమస్య అధికంగా కనిపిస్తుందని తెలిపారు. ప్రపంచంలో 30శాతం మంది ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్థుల్లో లివర్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయని, ప్రపంచంలోనే అత్యధిక షుగర్ వ్యాధి గ్రస్థులు ఉన్న దేశం భారతదేశం కాబట్టి, లివర్ సమస్యలు కూడా అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఊబకాయం ఉన్నవారిలో కొవ్వు పదార్థాలు లివర్‌లోకి చేరడం వల్ల అధి ఫ్యాటీ లివర్‌గా మారుతుందని అన్నారు. లివర్ సమస్యలు ఉన్నవారు అనారోగ్యంతో హాస్పిటల్‌కు వచ్చినప్పుడు మాత్రమే దీనిని గుర్తిస్తారని, సాధారణంగా లివర్ వ్యాధులు ఉన్నవారికి ఎటువంటి ముందస్థు లక్షణాలు బయటపడవని తెలిపారు. హెల్త్ చెకప్‌లలో లివర్ సమస్యలు బయటపడుతాయని చెప్పారు. ఇటీవల జరిగిన పరిశోధనల్లో లివర్ అనారోగ్యం గుండె సంబంధిత వ్యాధులను పెంచుతుందని తేలిందని స్పష్టం చేశారు.

### నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటి లివర్ వ్యాధుల్లోని రకాలు

వర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో జర్మనీ దేశ ఫెలోషిప్ గ్రహీత, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ జాయ్ వర్గీస్ నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధుల్లోని రకాలను కూడా ప్రజలకు వివరించారు. ఫ్యాటీ లివర్ ఉన్నవారి లివర్ సాధారణ స్థాయిలో పని చేస్తున్నప్పటికీ, దీనిని అల్ట్రాసౌండ్ ద్వారా గుర్తించవచ్చిన తెలిపారు. అదేవిధంగా నాన్ ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ అనే లివర్ సమస్య చాలా అరుదుగా ఉంటుందని, ఇది లివర్ టిష్యూస్‌ను, లివర్ పనితీరును బలహీన పరుస్తుందని డాక్టర్ జాయ్ వర్గీస్ వెల్లడించారు. లివర్ సిరోసిస్ అనే వ్యాధి లివర్‌ను బలహీన పరుస్తూ, నెమ్మదిగా లివర్ పని తీరును పూర్తిగా నిలిపివేస్తుందని చెప్పారు. అదేవిధంగా లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడేవారిలో కనిపించే లక్షణాలను కూడా డాక్టర్ జాయ్ వర్గీస్ తెలిపారు. నీరసంగా ఉండటం, రక్తవాంతులు, విరోచనాలు, కండరాల బరువు తగ్గిపోవడం, ఏకాగ్రత లోపించడం, కాళ్లవాపు, అబ్‌డోమ్ వాపు, చర్మంలో మార్పులు కనపడటం వంటివి లివర్ సంబంధిత వ్యాధుల లక్షణాలను తెలిపారు. ఇటువంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించి, తగిన చికిత్స అందుకోవాలని, లేని పక్షంలో లివర్ క్యాన్సర్ వచ్చే ప్రమాదాలు ఉన్నాయని వెల్లడించారు. డయాబెటిస్, హైపోథైరాయిడ్, ఊబకాయం, హెపటైటిస్ సి వంటి వ్యాధులు ఉన్నవారిలో లివర్ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు అపోలో స్పెషాలిటీ వైద్యశాల లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ డాక్టర్ జాయ్ వర్గీస్ తెలిపారు. లివర్ ఫంక్షన్ పరీక్షలు, లివర్ బయాప్సీ, ఎమ్‌ఆర్‌ఐ, సిటి వంటి పరీక్ష ద్వారా లివర్ వ్యాధులను సులువుగా గుర్తించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా లివర్ వ్యాధులను గుర్తించి తరువాత అవసరమైన మందులను వాడుకోవడంతోపాటూ, ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని, ఆహార నియమాలు, నిత్య వ్యాయమం చేయడం ద్వారా లివర్ సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండవచ్చుని డాక్టర్ జాయ్ వర్గీస్ స్పష్టం చేశారు. కొవ్వు శాతం అధికంగా ఉన్న ఆహారాన్ని తగ్గించడంతోపాటూ, అధిక క్యాలరీలు ఉన్న ఆహారం సమయానికి తీసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను అధికంగా స్వీకరిస్తూ, నిత్యం వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్ వంటి వ్యాయామాలు చేయడం ద్వారా లివర్ పని తీరును మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా షుగర్ వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించడం పూర్తిగా మానివేయడంతోపాటూ, వైద్యుల సూచనలతో విటమిన్ ఈ ఉన్న మాత్రలు, ఆహారం అధికంగా తీసుకోవడం వల్ల లివర్ వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. అంతేకాకుండా నిత్యం కాఫీని తగిన మోతాదులో స్వీకరించడం వల్ల కూడా లివర్ సమస్యల నుంచి బయటపడ్డవచ్చని అపోలో స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ జాయ్ వర్గీస్ స్పష్టీకరించారు. లివర్ సంబంధిత సమస్యలకు అపోలో స్పెషాలిటీ వైద్యశాలలో అన్నీ వసతులతో కూడిన వైద్యం అందుబాటులో ఉందని, అన్నీ రకాల లివర్ పరీక్షలు, చికిత్సలను నిపుణులైన వైద్యులు, సిబ్బంది అందిస్తున్నారని వెల్లడించారు. లివర్ సమస్యలు వచ్చిన తరువాత ఇబ్బందులు పడేకన్నా, వాటిని ముందుగానే గుర్తించి, తగిన చికిత్స తీసుకోవడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని డాక్టర్ జాయ్ వర్గీస్ తెలిపారు. అపోలో వైద్యశాలలో లివర్ వ్యాధులను గుర్తించేందుకు అన్నీ వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రజలు లివర్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు తగిన వైద్య పరీక్షలు చేయించుకుంటూ, మాస్టర్ హెల్త్ చెకప్‌లు చేయించుకోవడం వల్ల ఈ తరహా అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ అందిస్తున్న ఆధునాతన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గూడూరు డివిజన్ వార్తలు



జేసీబీతో పూడికను తీయిస్తున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన

## దేవసేన సుడిగాలి పర్యటన

గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన గూడూరు పట్టణంలోని 10, 11, 19 వార్డులలో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. డ్రైన్స్‌లో పూడిపోయిన కాలువను జేసీబీతో తీయించి కాలువలో నీళ్ళు పోయేటట్లు చేసారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దేవసేన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వల్ల కాలువలు పూడిపోయి నీళ్లు పారకుండా అవుతుందని, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని కోరారు. ప్రతిరోజూ శానిటేషన్ స్పెషల్ టీమును తీసుకుని గూడూరు మున్సిపాలిటీ వార్డులన్నీ పర్యటిస్తానన్నారు. ఎక్కడైనా కాలువలు పూడిపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ పాలిబోయిన రమేష్, టీడీపీ నాయకుడు కోదండయ్య, శ్రీధర్, శ్రీను తదితర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విద్యతోనే మార్పు - డాక్టర్ జనార్ధన్‌రెడ్డి

విద్యతోనే ప్రతి విద్యార్థి జీవితం దశ దిశ మారుతుందని, పేదరికాన్ని జయించాలంటే విద్య తోనే సాధ్యమౌతుందని ప్రముఖ సీనియర్ డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. గూడూరు మండలం చవట పాలెం ఉన్నత పాఠశాలలో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి దాతృత్వంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలను ఇటీవల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే గుడులు ప్రభుత్వ పాఠశాలలని, ప్రభుత్వ పాఠశాలల నుంచే ఎంతోమంది మేధావులు తయారయ్యారని, డాక్టర్లు, ఇంజనీర్లు ఉన్నతాధికారులు ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చినవారే అధికంగా ఉన్నారని తెలిపారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు గౌరవం లభిస్తుందని చెప్పారు. చిన్నతనం నుండి కష్టపడే విధానాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని, అప్పుడే ఎంత కష్టాన్నైనా అధిగమిస్తారని తెలియజేశారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు మునిరాజా, హరిప్రసాద్, బాలకృష్ణంరాజు, నాగేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డాక్టర్ జనార్ధన్‌రెడ్డి


# అందరి బంధువయా... ఆ సీతారామయ్య

## - శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చినజియ్యర్‌స్వామి

## తమ్మినపట్నంలో ఘనంగా దేవాలయం ప్రారంభోత్సవం



దేవుడు కొందరివాడు కాదని, అందరి వాడని... అందరికీ బంధువని శ్రీ పీఠం అధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జియ్యర్ స్వామి పేర్కొన్నారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామంలో పురాతన శ్రీ కోదండరామస్వామి దేవ స్థానాన్ని దాదాపు రెండు కోట్ల రూపాయల ఖర్చుతో పునర్ని ర్మించారు. ఈ సందర్భంగా జూన్ 27వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఆలయంలో ఋత్విక్కులచే పూజలు, హోమాలు, మహా కుంభాభిషేకం నిర్వహించారు. 30వ తేదీ ఆలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ట, సీతా రామలక్ష్మణ హనుమంతుని విగ్రహ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఎంతో వేడు కగా జరిగాయి. ఈ కార్యక్రమాలలో పాల్గొనడానికి విచ్చేసిన శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజియ్యర్‌స్వామికి ఆ ప్రాంత పెద్దలు, ఆలయ పునర్నిర్మాణంలో కీలకపాత్రధారి యరటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ కమిటి ఛైర్మెన్ యరటపల్లి శరణ్‌కుమార్‌రెడ్డి, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, చిల్లకూరు పిఏసిఎస్ అధ్యక్షులు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, ముత్యాలమ్మ దేవస్థానం మాజీఛైర్మెన్ వేమారెడ్డి మురళీకృష్ణారెడ్డి, కృష్ణపట్నం పోర్టు పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్ తది తరులు ఘనస్వాగతం పలికారు. ఈ సంద ర్భంగా చినజియ్యర్‌స్వామి ఆధ్వర్యంలో గోపుర కలశ ప్రతిష్ఠ, మూలవర్ల ప్రతిష్ఠ, సీతారాముల కళ్యాణోత్సవం కనులపండు వగా నిర్వహించారు. అనంతరం భక్తుల నుద్దేశించి చినజియ్యర్‌స్వామి మాట్లాడుతూ దేవుడికి కులమత బేధాలు లేవని, ఆయన దృష్టిలో అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ దేవాలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని చెప్పారు. దేవాలయం బాగుంటే ఊరు బాగుంటుందని, ఊరు బాగుంటే ప్రజలు బాగుంటారని, మీరంతా ఆ దేవుడి ఆశీస్సులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ప్రాచీన శిల్ప కళా వైభవాన్ని, ఆధ్యాత్మిక చింతనను చాటేలా గుడి నిర్మాణం చేసిన యరటపల్లి జానకిరామిరెడ్డి, యరటపల్లి శరణ్‌కుమార్ రెడ్డి, మందిర కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కృష్ణపట్నం పోర్టు రావడం వల్ల ఈ ప్రాంతం ఎంతగానో అభివృద్ధి చెందిందని, ప్రతిఒక్కరూ తమ సంపాదనలో కొంత భాగాన్ని ఆధ్యాత్మి కతకు, సమాజసేవకు ఖర్చు చేయాలని హితోపదేశం చేసారు. అనంతరం స్వామి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. నాలుగురోజుల పాటు జరిగిన వేడుకలలో గ్రామ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## లయన్స్‌క్లబ్ కొత్త కార్యవర్గం

గూడూరు లయన్స్‌క్లబ్ 2018-19 సంవత్సరానికి నూతన కమిటి ప్రమాణస్వీకారాన్ని గత నెల 30న ఘనంగా క్లబ్ ప్రతి నిధులు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వాకాటి రామమోహన్ రావు, కార్యదర్శిగా ఎం.రూపేష్‌రెడ్డి, కోశాధికారిగా రవిచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.చంద్రశేఖర్, పిఆర్వోగా కడివేటి చంద్రశేఖర్ తదితర కమిటీ సభ్యులచే సుధాకర్‌రెడ్డి ప్రమాణస్వీకారాన్ని చేయించారు. లయన్స్ క్లబ్‌లో నూతనంగా చేరిన సభ్యులతో కూడా ప్రమాణస్వీకారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గూడూరు ప్రాంతంలో విద్యా వ్యాప్తికి క్లబ్ చేస్తున్న సేవలను విస్తరించ దంతో పాటుగా వైద్యసేవలను విస్తృతం చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఉదయభాస్కర్, శ్రీరాములు, షేక్‌రియాజ్ అహ్మద్, చెంచురామయ్య, ఎన్.భాస్కర్‌రెడ్డి, మస్తాన్ ఉన్నారు.




నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న సుధాకర్‌రెడ్డి

## రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా మునిగిరీష్



ఈ నెల 1వ తేదీ గూడూరు దివ్య ఫంక్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ ఎలెక్ట్ భరత్ పాండ్యా ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా కొణిదల మునిగిరీష్ ప్రమాణస్వీకారం చేసారు. వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి గవర్నర్‌గా నియమించడం అభినందనీయ మన్నారు. రోటరీ క్లబ్ ద్వారా సమాజంలో చేస్తున్న సేవలతో అనేకమంది జీవితాల్లో వెలుగునింపడం సంతోషంగా ఉంద న్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, వివిధ వసతుల ఏర్పాటుతో రోటరీ సేవలు విస్తృతం చేశామని చెప్పారు. రోటరీ వెస్ట్ క్లబ్ రొటేరియన్లు, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రమాణ స్వీకారాన్ని ఘనంగా నిర్వహించారు. రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్షుడిగా చైతన్య కుమార్‌రెడ్డి, సెక్రటరీగా రాంప్రసాద్, రోటరీ మెయిన్‌క్లబ్ అధ్యక్షుడుగా హరి ప్రసాద్, కార్యదర్శిగా రామకృష్ణస్వరూప్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా డాక్టర్ సి.రోహిణి, కార్యదర్శిగా కుమారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మహిల్ పాటిల్, సురేంద్రరెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, కనుమూరు హరిచంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, దయా కర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, బాలకృష్ణంరాజు, రఘురామిరెడ్డి, వాసు గౌడ్, ఎన్.వి.రత్నం, మునిరాజా, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



గూడూరు ఎల్ఐసి హెచ్‌జీఏగా పనిచేసి పదవీ విరమణ చేసిన వాకాటి రామమోహన్ దంపతులను ఇటీవల సన్మానిస్తున్న ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ బాలాజీబాబు, ఏఏవో సి.హెచ్. రాజశేఖర్‌రెడ్డి, కె.గోపి, శివకుమార్, దూబగుంటి బాలశ్రీనివాసరావు, ఎమ్.మురళీరెడ్డి

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

స్థిరాస్తుల మీద, షేర్ల మీద ఆదాయం ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. వ్యవహారాలలో వ్యతిరేకతపోతుంది. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు పనిభారం ఉంటుంది. పనులు నిదానంగా సానుకూలంగా సాగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఖర్చులు ఎక్కువైనా వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కొత్త విషయాలు తెలుసుకుంటారు. కుటుంబ సౌఖ్యం, మీ ఆరోగ్యం బాగుంటుంది. దూర ప్రయాణాలుంటాయి. సభలు సమావేశాలలో పాల్గొంటారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగానే ఉంటాయి. ముఖ్య విషయాలపై నిర్ణయాలు తీసుకొనేటప్పుడు జాగ్రత్తపడండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధుమిత్రుల సహకారంతో ఒక సమస్య నుండి బయటపడతారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు చేస్తారు. పనులందు టెన్షన్ ఉంటుంది. అనవసర వ్యవహారాలలో తలదూర్చవద్దు. ఉద్యోగులు బాధ్యతలందు నిర్లక్ష్యం చూపవద్దు మరియు అధికారులకు పబ్లిక్‌తో సమస్యలు రావచ్చును.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రతిభాపాటవాలు, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులకు పని భారం, అధికారుల సహకారం బాగుంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపకాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి బాగుండి, వ్యాపారాలలో వృద్ధి, ఆదాయం బాగుంటుంది. వృత్తి పరంగా పెరుగుదల, తీరికలేకపోవడం ఉంటుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 6.7.2018 నుండి
తేది. 12.7.2018 వరకు

ఈ వారం మిధునంలో రవి, కర్కాటకంలో బుధ రాహువులు, సింహంలో శుక్రుడు, తులలో గురువు, ధనుస్సులో శని, మకరంలో కుజకేతువులు, మీన మేష వృషభ మిధున రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము :**

ముహూర్తములు లేవు.

**నిజ జ్యేష్ఠ బహుళపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 6 | శుక్ర | అష్టమి | రా॥ గం.8.02వ॥ |
| తేది. 7 | శని | నవమి | రా॥ గం.7.37వ॥ |
| తేది. 8 | ఆది | దశమి | రా॥ గం.6.43వ॥ |
| తేది. 9 | సోమ | ఏకాదశి | సా॥ గం.5.24వ॥ |
| తేది. 10 | మంగళ | ద్వాదశి | సా॥ గం.3.43వ॥ |
| తేది. 11 | బుధ | త్రయోదశి | ప॥ గం.1.45వ॥ |
| తేది. 12 | గురు | చతుర్దశి | ప॥ గం.11.32వ॥ |
| తేది. 13 | శుక్ర | అమావస్య | ఉ॥ గం.9.10వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత తక్కువ. ఉద్యోగ సౌఖ్యం, అధికారవర్గ సహకారం బాగుంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలున్నాయి. అనుకోని దూరప్రయాణాలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. మాటలలోను, చేతలలోనూ తొందరపాటు ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయముండినా ఖర్చులు పెరుగుతాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగులకు పనిభారం, స్థాన మార్పులుండవచ్చును. అనుకోని ఖర్చులు కొన్ని పైనబడగలవు. బంధువులతో విభేదాలు, చికాకులుంటాయి. బిడ్డల విద్యా, ఉద్యోగ విషయాలలో శుభవార్తలు వింటారు. వృత్తి వ్యాపారాలలో సామాన్య వృద్ధి, రాబడి ఉంటుంది. మీ సలహాలు సూచనలను ఇతరులు ఆమోదిస్తారు. ఇతరులకు హామీలు, అప్పులు ఇవ్వవద్దు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న పనులను లౌక్యంగా జరుపుకొనాలి. అధికారులకు ఉద్యోగులకు పనిభారం, వత్తిడి పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. స్థిరాస్తుల లావాదేవీలు, పెట్టుబడుల ప్రయత్నాలు వాయిదా వేసికొనడం మంచిది. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగి ఆదాయముంటుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

దైవక్షేత్ర సందర్శన, విదేశీ ప్రయాణాలకు అనుమతులు దొరుకుతాయి. అనుకున్న పనులు ప్రశాంతంగా నిర్వహిస్తారు. పెట్టుబడులకు అవకాశాలుంటాయి. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆదాయం పెరుగుతుంది. వృత్తిపరంగా అవకాశాలు బాగుంటాయి. అయితే కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. వ్యవహారాలను జాగ్రత్తగా నిర్వహించాలి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికవ్యవహారాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం. దూర ప్రయాణాలుంటాయి. ఆరోగ్యపరంగా ఇబ్బంది పడతారు. వివాదాలు పరిష్కారానికి రావచ్చును. కుటుంబ సౌఖ్యం ఉంటుంది. స్థిరాస్తులపై రాబడి, షేర్ల మీద లాభాలుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. వ్యాపార వర్గాలకు అభివృద్ధి అవకాశాలు తగ్గి, ఆదాయ విషయంలో అసంతృప్తి ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

సన్నిహితుల వల్ల సమస్యలు రావచ్చును. స్థిరాస్తులపై, పెట్టుబడులపై ఆదాయముంటుంది. కొత్త కాంట్రాక్టులు, నిర్మాణాలు లభించి ముందుకు సాగుతారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొన్ని పనులు అనుకోకుండా పూర్తి కాగలవు. కొత్త పరిచయాలు, దూర ప్రయాణాలుండవచ్చును. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత కలదు. ప్రభుత్వ అనుమతులు లభించడం, వస్తు వాహన రిపేర్లుండగలవు. ఆర్థికంగా బలపడే ప్రయత్నాలలో అనుకూలత కలదు. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతుంటాయి. ఆదాయానికి తగ్గ ఖర్చులుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బిడ్డలకు ఉన్నత విద్యావకాశాలు దొరకడం, శుభ కార్య నిర్ణయాలు జరగడం ఉంటుంది. ఉద్యోగులకు పనులు సాఫీగా జరగడం, మీ సలహాలు ఆమోదం పొందడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త ఆర్థిక ప్రయత్నాలందు అనుకూలత, వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులు నెరవేరుతాయి. షేర్ల మీద ఆదాయం ఉంటుంది.

# బీజేపీ నేతలకే షాకిచ్చిన సీఎం రమేష్

శ్రీను గల్పిక

దాదాపు పాతిక ప్రపంచ మేటి నగరాలను మిక్సీలో వేసి గ్రైండ్ చేసి బయటకు తీస్తే వచ్చినటువంటి అమరావతి నగరం. ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం. హైటెక్‌రత్న చంద్రబాబు అక్కడ కూర్చుని వున్నాడు. ఆయన ముందు ఒక వేయింగ్ మిషన్ (బరువు తూచే యంత్రం) వుంది. ఎంపీలు సుజనాచౌదరి, జేసీ దివాకర్‌రెడ్డి, గల్లా జయదేవ్, మాగంటిబాబు, కేశినేని నాని, మురళీమోహన్, అవంతి శ్రీనివాస్, బుట్టా రేణుక, సీఎం రమేష్‌లు వరుసగా నిలబడి వున్నారు. అక్కడే ఇద్దరు డాక్టర్లు కూడా వున్నారు. చంద్రబాబు ఒక్కొక్కరిని ఆ మిషన్ ఎక్కమన్నాడు. ఎంపీలందరూ ఎక్కి దిగుతుండగా డాక్టర్లు వాళ్ళ వెయిట్ నోట్ చేసుకుని, తర్వాత అందరికీ బీపీలు, షుగర్‌లు చెక్ చేసారు. ఆ స్క్రీనింగ్ టెస్ట్‌లు అయ్యాక, మురళీమోహన్ వుండి... ఎందుకు సార్ ఈ టెస్ట్‌లు అని అడిగాడు. కడప ఉక్కు కర్మాగారం కోసం, విశాఖ రైల్వే జోన్‌ల కోసం మీలో ఎవరో ఒకరు ఆమరణ నిరాహారదీక్ష చెయ్యాలి. ఎవరైతే సరిపోతారో తేల్చడానికే ఈ టెస్ట్‌లు అని చెప్పాడు. వెంటనే బుట్టా రేణుకా... నేను ఆల్‌రెడీ వీరమాచనేని డైట్ ఫాలో అవుతున్నాను సార్, నాకు అవసరం లేదండి. మురళీమోహన్ అందుకుని... నేను ఓ 5కిలోలు తగ్గాల్సి వుంది. ఐదు రోజుల దీక్షకైతే నేను రెడీ అని చెప్పాడు. కేశినేని నాని వుండి.. దీక్షా శిబిరంలో నాకు అన్ని సౌకర్యాలు కల్పిస్తే అక్కడే ఆడుతూ పాడుతూ దీక్ష చేయడానికి నేను సిద్ధం అని అన్నాడు. దానికి చంద్రబాబు... నువ్వు దీక్ష చేస్తే వచ్చే లాభం కంటే పార్టీకి జరిగే నష్టమే ఎక్కువ. నువ్వు వద్దులే అని చెప్పాడు. గల్లా జయదేవ్ వుండి... నేను కరెక్ట్ వెయిట్ వున్నాను సార్, ఇంతకంటే తగ్గితే కరెక్ట్ కాదని డాక్టర్లు చెప్పారు అని అన్నాడు. చంద్రబాబు చిత్తూరు ఎంపీ శివప్రసాద్ వైపు చూసాడు. ఆయనకు గుండె గతుక్కుమంది. వెంటనే అలర్టై... భలేవారు సార్, నేను లావు వున్నానని అనుకుంటున్నారా... నాదంతా బెలూన్ బాడీ... లోపల వుండేదంతా గాలే... అదీగాక నేను దీక్షలో కూర్చుంటే అక్కడ ఎంటర్‌టైన్‌మెంట్ ఏముంటుంది. ఎవరు దీక్షలో కూర్చున్నా నేను దీక్ష జరిగినన్ని రోజులు రోజుకో గెటప్‌లో వచ్చి అక్కడ ఎంటర్‌టైన్‌మెంట్ చేస్తా అని చెప్పాడు. అందరి మాటలు విన్న జె.సి.దివాకర్‌రెడ్డి... ఛస్... దీక్ష చేయడమంటే ఎందుకు అందరూ అంత భయపడుతున్నారు. బాబుగారి కోసం నేను కూర్చుంటా గాని... పొద్దున టిఫిన్‌లోకి దోశ, కోడి కూర, మధ్యాహ్నం రాగిసంగటి, చేపల పులుసు, రాత్రికి లైట్‌గా నాలుగు పుల్కాలు, రొయ్యల ఫ్రై ఏర్పాటు చేయండి చాలు... ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు దీక్ష చేస్తా అని హామీ ఇచ్చాడు. ఆ మాటలకు చంద్రబాబుకు కళ్ళు బైర్లు కమ్మాయి. దీక్ష అంటే మూడుపూటలా తింటూ చేసేది కాదు, తినకుండా చేసేది అని అన్నాడు. అందుకు దివాకర్‌రెడ్డి... అలాంటి దీక్షలు నావల్ల కాదబ్బా... తినకుండా తాగకుండా వుండేదానికి ఈ పదవులెందుకు, ఈ పాకులాటలెందుకు? అని అన్నాడు. అప్పుడే వైద్యులు రిపోర్ట్‌లు అంతా రెడీ చేసి... సార్, కడప ఉక్కు దీక్షకు సీఎం రమేష్ గారైతే కరెక్ట్ అని చెప్పారు. ఆ మాట వినగానే రమేష్ ముఖంలో రంగులు మారాయి. చంద్రబాబు రమేష్ వైపు చూసి... ఇక నీకు తప్పదు... డాక్టర్లు కూడా నీవే కరెక్ట్ అంటున్నారు. నవ్వు పది కిలోల బరువు తగ్గాలట. నువ్వు గట్టిగా ఐదురోజులు చెయ్... ఈలోపు కేంద్రం ఏదో ఒక హామీ ఇస్తే నీచేత విరమింపజేస్తాంలే అని చెప్పాడు. రమేష్ చంద్రబాబు చేతులు పట్టుకుని... మీ మీద నమ్మకంతో కూర్చుంటున్నాను, వీడు కూర్చున్నాడులే... ఇంకెక్కడికి పోతాడు అని నన్ను ముంచొద్దు... నా భార్య, బిడ్డలకు నేనే ఆధారం అని చెప్పాడు. నీకు ఏమీ కాదు, నేను చూసుకుంటాను కదా... గట్టిగా నాలుగు రోజులకే కేంద్రం దిగొస్తుంది చూడు... కడపకు ఉక్కు ఫ్యాక్టరీ తెచ్చిన ఘనత నీదే అవుతుంది. చరిత్రలో నిలిచిపోతావు అని చంద్రబాబు చెప్పాడు. ఆ విధమైన చరిత్ర లేకున్నా పర్వాలేదు సార్, ఇంకో రకంగా చరిత్రలో నిలిచిపోయేలా చేయొద్దు అని సీఎం రమేష్ వేడుకున్నాడు.

★★★★★

కడపలో సీఎం రమేష్ ఉక్కు దీక్ష మొదలైంది. మొదటి రోజున వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వచ్చి సీఎం రమేష్ చేత ఒకటిన్నర లీటర్ బత్తాయి జ్యూస్ తాపించి లాంఛనంగా దీక్షను మొదలుపెట్టించాడు. ఈ సందర్భంగా సోమిరెడ్డి తన ప్రసంగంలో... అప్పట్లో అమరజీవి పొట్టి శ్రీరాములు... ఇప్పుడు సీఎం రమేష్. ఆయన తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం వచ్చేదాకా దీక్షను విరమించలేదు. ఈ దీక్షలోనే ఆయన పైకిపోయి మనకు ప్రత్యేక రాష్ట్రం తెచ్చాడు. ఇప్పుడు సీఎం రమేష్ కూడా కడపకు ఉక్కు పరిశ్రమ తెచ్చేదాకా దీక్ష విరమించడని హామీ ఇస్తున్నా అని ప్రకటించాడు. నా దీక్షకు మీ హామీ ఏంటంటూ సీఎం రమేష్ మనసులో తిట్టుకున్నాడు.

రెండోరోజు జేసీ దివాకర్‌రెడ్డి పరామర్శించడానికొచ్చి... ఉక్కు దీక్ష లేదు... తుక్కు దీక్ష లేదు... ఇలాంటి వాళ్ళంతా దీక్షలు చేస్తే కేంద్రం దిగొచ్చే పనయితే దేశం నిండా పరిశ్రమలే వుంటాయి. బో దీక్ష చేసావులే పోవయ్యా.. ఇంటికాడ కోడి కూర, దోశ చేసి పెట్టారంట... శుభ్రంగా తినిపడుకో పో అంటూ చెప్పి దిగొచ్చేసాడు. ఆయన స్పీచ్ దెబ్బకు అక్కడున్న అందరికీ తలలు తిరిగాయి.

ఇలా సీఎం రమేష్ దీక్ష ఎనిమిదో రోజుకు చేరింది. దీంతో విజయవాడలోని బీజేపీ ఆఫీసులో నాయకులు కన్నా లక్ష్మీ నారాయణ, సోము వీర్రాజు, కంభంపాటి హరిబాబు, గోకరాజు గంగరాజు, విష్ణు కుమార్‌రాజు, కర్నాటి ఆంజనేయరెడ్డిలు సమావేశమయ్యారు. కన్నా వుండి... సీఎం రమేష్ ఉక్కు సంకల్పంతో దీక్ష చేస్తున్నాడు. ఆయన దీక్షకు కేంద్రం దిగొచ్చి ఉక్కు ఫ్యాక్టరీ ఇస్తే ఏపిలో బీజేపీ ఇంకా పతనమవుతుంది... కాబట్టి అతని దీక్షను భగ్నం చేయాలి అని అన్నాడు. ఇలా చేద్దాం అంటూ కర్నాటి ఆంజనేయ రెడ్డి వారి చెవిలో ఒక ఉపాయం చెప్పాడు. అలాగే చేద్దాం అంటూ అందరూ లేచారు.

★★★★★

కడపలో సీఎం రమేష్ దీక్షా శిబిరం. అప్పుడే రెండు కార్లు ఆగాయి. అందులో నుండి బీజేపీ నాయకులు దిగారు. వీళ్ళు దీక్షను విరమింపచేయమని బ్రతిమలాడడానికి వచ్చారనుకుని సీఎం రమేష్ కళ్ళు ఆనందంతో మెరిసాయి. కాని, వాళ్ళు రావడంతోటే వారి చేతుల్లో వున్న నెల్లూరు 'రియాజ్ బిరియాని' ప్యాకెట్లు విప్పారు. దాంట్లో వంకాయ కూర కలుపుకుని తినసాగారు. ఆ వాసనకు సీఎం రమేష్ బెండ్ అవుతాడని వీళ్ళ ప్లాన్... కాని సీఎం రమేష్ తాపీగా... హనుమంతుడి ముందా మీ కుప్పిగంతులు... రేయ్ అవి అందుకోండిరా అని కేకేసాడు. అనుచరులు వెంటనే కొన్ని ప్యాకెట్లు తెచ్చారు. సీఎం రమేష్ వాటిని విప్పాడు... అవి హైదరాబాద్ ప్యారడైజ్ బిర్యాని ప్యాకెట్లు.. వాటిని చూసి బీజేపీ నాయకులు గుడ్లు తేలేసారు.

# కళ్యాణ వైభవం...!



విశ్వసాయి విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ - రుక్మిణిల కుమారుడు **సాయి అఖిలేంద్ర - వాణిశ్రీ** (కోల్‌కత్తా వాస్తవ్యులు సత్తిరాజు రవికుమార్ - లలితల కుమార్తె)ల కల్యాణం జూన్ 30వ తేదీ సికింద్రాబాద్‌లోని నోమా కళ్యాణ వేదికనందు, రిసెప్షన్ జూలై 2వ తేదీ నెల్లూరు పివిఆర్ కళ్యాణమండపం నందు వైభవంగా జరిగాయి. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరు ఆదిత్యనగర్‌కు చెందిన ఏల్చూరు శ్రీనివాసరావు - లక్ష్మీకుమారిల కుమారుడు **దినేష్‌కుమార్ - మౌనిక** (గుంటూరు వాస్తవ్యులు మాజేటి వెంకటశివరామప్రసాద్ - సరళిల కుమార్తె)ల వివాహం జూన్ 27వ తేదీ గుంటూరులోని సిద్ధార్థ గార్డెన్స్ నందు జరుగగా, రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణ హాజరై వధూవరులను దీవించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

# రోశయ్య పుట్టినరోజు పండుగలో...

## నెల్లూరోళ్ళు





రాష్ట్ర మాజీముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కె.రోశయ్య 85వ పుట్టినరోజు వేడుకలు 4వ తేదీ హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. రోశయ్య ఆత్మీయ మిత్రులు, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు, నెల్లూరీయుడు కె.వి.చలమయ్య జొన్నవాడ కామాక్షమ్మ, పెంచలకోన, సూళ్ళూరుపేట చెంగాళమ్మ, నెల్లూరు రాజరాజేశ్వరమ్మ ప్రసాదాలను రోశయ్యకు అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్ అధినేతలు యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్, గాదంశెట్టి శ్రీకాంత్ తదితరులు రోశయ్యను కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కనియంపాటి రామకృష్ణకు డాక్టరేట్




విసి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కనియంపాటి రామకృష్ణ

ఆత్మకూరు మండలం మురగళ్ళ గ్రామానికి చెందిన కనియంపాటి రామకృష్ణను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌తో సత్కరించింది. ఈ నెల 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన విశ్వవిద్యాలయ 14వ స్నాతకోత్సవంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ చేతులమీదుగా రామకృష్ణ డాక్టరేట్‌ను అందుకున్నారు. సుప్రసిద్ధ సాహితీవేత్త, సహజకవి మల్లెమాల సుందరరామిరెడ్డి రచించిన 'మల్లెమాల రామాయణం'పై విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య పొన్నా లీలావతి పర్యవేక్షణలో రామకృష్ణ పిహెచ్‌డి పూర్తిచేశారు. తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, మల్లెమాల రామాయణంపై పరిశోధన చేసి డాక్టరేట్‌ను పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులు విశ్వజ్ఞాచార్యులు-అన్నపూర్ణమ్మలకు, గురువులకు, మిత్రులకు, కుటుంబసభ్యులైన సంగీతలక్ష్మి, శ్రీదేవి, వినయ్‌కుమార్ తదితరులందరికీ తన కృతజ్ఞతలు తెలిపారు.

# అపోలోలో అరుదైన గుండె ఆపరేషన్



**కుడివైపు గుండె వున్న వృద్ధురాలికి విజయవంతంగా సర్జరీ**

నెల్లూరు జిల్లాతోపాటూ, ప్రకాశం, చిత్తూరు జిల్లా ప్రజలకు మెరుగైన అత్యాధునిక వైద్యసేవలను అందిస్తున్న నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు మరో అరుదైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ నెల 4వ తేదీ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ నాగరాజు మరియు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సల్‌రెడ్డిలు మాట్లాడుతూ సాధారణంగా ప్రతి వ్యక్తికి గుండె ఎడమ భాగంలో ఉంటుందని, అయితే నెల్లూరుజిల్లా కోవూరు పట్టణం పిఆర్‌ఆర్ కాలనీకి చెందిన 65ఏళ్ల పార్వతి బాయికి పుట్టుకతోనే గుండె కుడి వైపు ఉండటంతో ఆమె గుండెకు సంబంధించిన అనారోగ్యంతో నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు వచ్చారని తెలిపారు. ఆమె గుండెను పరీక్షించగా, బైపాస్ సర్జరీ అవసరమని గ్రహించి, వెంటనే పార్వతి బాయికి కుడివైపున ఉన్న గుండెకు బైపాస్ సర్జరీ చేసి, మూడు గ్రాఫ్ట్‌లను విజయవంతంగా అమర్చామని అన్నారు. ఈహెచ్‌ఎస్ స్కీమ్ ద్వారా ఆమెకు ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. సాధారణంగా ఎడమవైపు ఉండే గుండెకు ఆపరేషన్ చేయడం సహజంగా ఉంటుందని, అయితే పుట్టుకతోనే కుడివైపు గుండె ఉన్న పార్వతిబాయికి బైపాస్‌సర్జరీ చేయడం ఎంతో క్లిష్టమైన పరిస్థితి అని, దీనిని తాము సవాల్‌గా తీసుకుని, విజయవంతంగా ఆమెకు గుండె శస్త్రచికిత్స చేసి, గ్రాఫ్ట్‌లను అమర్చినట్లు తెలిపారు. ఎంతో క్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన సిబ్బంది సహాయ సహకారాలతో దిగ్విజయంగా పూర్తి చేసినట్లు వారు వెల్లడించారు. ఈ సమావేశంలో డాక్టర్ షర్మిల, ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్ మరియు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్వేతారెడ్డి పాల్గొన్నారు.

# అల్లాడి హేమంత్‌కు అభినందనలు



శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ ఫిజిక్స్ విభాగంలో అల్లాడి హేమంత కుమార్‌కు పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలోని గాదంకిలో ఉన్న ఎన్‌ఏఆర్‌ఎల్ డాక్టర్ ఎం.వెంకటరత్నం పర్యవేక్షణలో 'ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ది సబ్-డైలీ స్కేల్ వేరియబిలిటీ ఇన్ ది ట్రాపికల్ ట్రోపాపాస్ లేయర్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు జూన్ 30న జరిగిన స్నాతకోత్సవంలో హేమంత్‌కుమార్‌కు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కాగా, హేమంత్‌కుమార్ విఆర్ లా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ అల్లాడి సుబ్రహ్మణ్యం కుమారుడు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్‌కు ఆయన సహచరులు అభినందనలు తెలిపారు.

## కాలధర్మం

# బెజవాడ దశరథరామిరెడ్డి



ఉమ్మడి మద్రాసు రాష్ట్ర మాజీస్పీకర్ బెజవాడ రామచంద్రారెడ్డి తనయుడు రైతు నాయకులు, బుచ్చిరెడ్డిపాలెం సంస్థానంలో పేరెన్నికన్న బెజవాడ కుటుంబసభ్యుడు బెజవాడ దశరథరామిరెడ్డి తన 86వ ఏట ఈ నెల 1వ తేదీ రాత్రి కన్నుమూసారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన దైవ సాన్నిధ్యం పొందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, పెద్దకొడుకు బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి ప్రగతి ఆగ్రోప్రోడక్ట్స్ అధినేతగా నెల్లూరుజిల్లాలో అందరికీ సుపరిచితుడే! రెండవ కుమారుడు బెజవాడ శ్రీనాథ్‌రెడ్డి. బెజవాడ రామచంద్రారెడ్డి శ్రీమతి బుజ్జమ్మల మూడో సంతానం దశరథరామిరెడ్డి మాజీపార్లమెంట్ సభ్యులు స్వర్గీయ బెజవాడ పాపిరెడ్డి, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు, రైతు నాయకులైన బెజవాడ ఓబుళరెడ్డిలు ఆయనకు అన్నలవుతారు.

బెజవాడ దశరథరామిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాలలో తక్కువుగా వున్నప్పటికీ పరోక్షంగా ఎంతోమంది రాజకీయ ఎదుగుదలకు కృషి చేసారు. 1962లో బుచ్చిరెడ్డిపాలెం ఉపసర్పంచ్‌గా పనిచేసిన ఆయన 1985లో అల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి సీపీఎం నాయకులు జక్కా వెంకయ్య చేతిలో పరాజయం పొందారు. ఆ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థికంటే ఎక్కువ ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. 1999లో అల్లూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా రాజకీయారంగేట్రం చేసిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి గెలుపులో కీలకపాత్ర పోషించారు. బుచ్చిరెడ్డిపాలెం ప్రాంతంలో రైతాంగం సమస్యల పరిష్కారానికి, సాగునీటి పారుదలకు, ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి విశేషకృషి చేసారు. ఈ ప్రాంత ప్రజలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వారు వాటిని సద్వినియోగం చేసుకునేలా చేసేవారు. బుచ్చి రైతాంగానికి ఆయన చేసిన సేవలు విస్మరించలేనివి. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



# రిటైర్డ్ పోలీసులకు సన్మానం

ఏపి పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను ఈ నెల 2న ఘనంగా సన్మానించారు. గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన బాలాజీనగర్, సిసిఎస్, శ్రీహరికోట ఎస్సైలు భాస్కరయ్య, మధుసూదన్‌రెడ్డి, అన్వర్‌బాషా, శ్రీరామకృష్ణ, చెంగయ్య, ఎఎస్సైలు బషీర్, సత్తార్, అల్లూరు రాజు, డివిఎస్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, పెంచలరాజు, లక్ష్మీనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ మునీర్‌ను ఏఎస్పీ బి.శరత్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ ఎస్.వీరభద్రుడు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేసి ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎం.గంగాధర్, డిఎస్పీ శ్రీనివాసాచారి, నగర ఇన్స్‌పెక్టర్లు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కన్నాపై చెప్పు దాడి

## • ఉతికి ఆరేసిన బీజేపీ కార్యకర్తలు

ఈ నెల 4వ తేదీ కావలి పర్యటనలో వుండగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణపై ఓ వ్యక్తి చెప్పు దాడికి పాల్పడ్డాడు. కన్నా లక్ష్మీనారాయణ ఓపెన్ టాప్ జీప్‌లో పట్టణంలో ర్యాలీగా వస్తుండగా శివాజీ సెంటర్‌లో గొర్రెపాటి మహేష్ అనే వ్యక్తి కన్నాపైకి చెప్పు విసిరాడు. అయితే అది గురి తప్పి ఇంకో కార్యకర్తపై పడింది. ఇది గమనించిన బీజేపీ కార్యకర్తలు ఆవేశంతో ఊగిపోయి చెప్పు విసిరిన మహేష్‌ను పట్టుకుని ఉతికి ఆరేసారు. అతనిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతనిది ప్రకాశం జిల్లా టంగుటూరు. డీజిల్ ధరలు పెరిగిన దానికి నిరసనగానే ఈ దాడికి పాల్పడినట్లు చెప్పాడు. మరి డీజిల్ రేట్లకే కన్నాపై చెప్పులు విసిరితే, ఇచ్చిన హామీలన్నింటిని తుంగలో తొక్కిన వారిపై ఇంకేం విసరాలో...

# ఎన్.డి వే బ్రిడ్జి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు



ఎన్.డి వే బ్రిడ్జి వారి సహకారంతో చిల్లకూరు మండలం పాలిచెర్లవారిపాళెం ప్రాథమిక పాఠశాలలోని పేద విద్యార్థులకు ఎస్‌ఎల్‌ఎన్ బాబు ఆధ్వర్యంలో ఇటీవల నోటు పుస్తకాలు, విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. సనత్‌రెడ్డి, ప్రకాశ్, ఎన్.చంద్రశేఖర్, హెడ్‌మాస్టర్ సుమతి పాల్గొన్నారు.

**'మాతృభాష-గురువుల ప్రాధాన్యత'పై**

# 8న కవిసమ్మేళనం

సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 8న 'మాతృభాష-గురువుల ప్రాధాన్యత' అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షులు సర్వేపల్లి రామమూర్తి, ముఖ్య కార్యదర్శి సర్వేపల్లి ప్రభాకరరావు, కోశాధికారి శివకుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో ఆ రోజు సాయంత్రం 4గంటల నుంచి కవిసమ్మేళనం జరుగుతుందన్నారు. ఉత్తమ కవితలు రచించినవారికి గురుపూజోత్సవం (సెప్టెంబర్ 5) రోజున సన్మానం జరుగుతుందన్నారు. ఎంతో ఘనకీర్తి కలిగిన మన తెలుగుభాష కాలక్రమంలో మరుగునపడిపోకుండా మన భాషను మనం కాపాడుకోవాలని, భావితరాలకి మాతృభాష ఔన్నత్యాన్ని తెలియజేసేవిధంగా తెలుగు భాష పరిరక్షణకు అందరూ కృషిచేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

# విషం కక్కి.. విద్వేషం రగిల్చి..

**భారతదేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ అన్నది హద్దులు దాటుతోంది. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో శాడిస్టులు సమాజంలో విద్వేషపు మంటలు రగిలిస్తున్నారు. వీళ్ళకు ఇంకొందరు శాడిస్టులు జతవుతూ మానవ సమాజాన్ని కలుషితం చేస్తున్నారు. ఇలాంటి శాడిజం భావాలున్న వారికి తెలుగు మీడియా పునరావాస కేంద్రాలవుతున్నాయి.**



ఈ దేశంలో ఒకడు రాముడిని పూజిస్తాడు... ఇంకొకడు అల్లాను ఆరాధిస్తాడు... మరొకడు జీసెస్‌ను నమ్ముతాడు. ఎవరి నమ్మకం వారిది. ఎవరి మతం వారిది. రాముడిని కొలిచే వాడు జీసెస్‌ను తిట్టాల్సిన పనిలేదు. క్రైస్తవుడు హిందూ సంస్కృతిని విమర్శించాల్సిన పనిలేదు. ఎవరి సంస్కృతిని వాళ్ళు పాటించుకుంటూ పోతుంటే ఏ సమస్యా లేదు. అసలు మత సంబంధ కార్యక్రమాలను ఇంటికి, ఒంటికి పరిమితం చేసుకుంటే ఏ బాధా లేదు.

అలా కాకుండా మతాలను, దేవుళ్ళను వీధుల్లోకి తెచ్చిపెట్టి, టీవీలలో వాటిపై చర్చావేదికలు పెడుతుండడంతోనే మనుషుల మధ్య మనస్పర్ధలు వస్తున్నాయి.

భారతదేశంలో కోట్లాది మంది హిందువులకు శ్రీరాముడు ఆరాధ్యుడు. పితృవాక్కు పరిపాలకుడిగా పేరు. రామాయణం పవిత్ర గ్రంథం. సుపరిపాలనకు రామరాజ్యం పెట్టింది పేరు. ఇలాంటి రామాయణాన్ని కూడా గతంలో కొందరు వక్రీకరించారు. తమ మెదడులో, మనసులో వున్న పైత్యాన్ని సిరాగా మార్చి రామాయణాన్ని వక్రీకరిస్తూ ఎన్నో వ్యంగ్య రచనలు చేసారు. ఎవరు ఎంతగా బురద చల్లినా వజ్రం వజ్రమే! దాని కాంతిని కోల్పోదు. అలాగే ఎవరెన్ని ఛండాలపు రాతలు వ్రాసినా ఎవరు ఎంతగా కారు కూతలు కూసినా రాముడు రాముడే, రామాయణం రామాయణమే! వాటి పవిత్రత ఎక్కడికీ పోదు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అంతటి వాడే రాజ్యాంగం పుస్తకం పైన శ్రీరామ పట్టాభిషేకం చిత్రం ప్రచురింపజేసారంటే దాని విలువ తెలపకనే తెలిపాడు.

అయితే మీడియా అంతగా అభివృద్ధి చెందని కాలంలో రాముడిని, రామాయణాన్ని, లేదా హిందూ సంస్కృతిని ఎవరు ఎంతగా కించపరుస్తూ మాట్లాడినా ప్రజలకు తెలిసేది కాదు. వాళ్ళ మనోభావాలు ప్రభావితమయ్యేవి కూడా కాదు. ఇప్పుడు మీడియా విస్తృతంగా వుంది. ఎవరేం మాట్లాడినా క్షణాల్లో ప్రపంచమంతా పాకిపోతుంది. కాబట్టి విజ్ఞులైన వారు ఎవరైనా సరే ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా మాట్లాడితే బాగుంటుంది. మానవ సమాజానికి మంచి చేయాల్సిన మీడియా కూడా మత ఉద్రేకాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా వుంటే మరీ మంచిది.

ఇటీవల ఒక తెలుగు న్యూస్ ఛానెల్ వేదికగా కత్తి మహేష్, గోగినేని బాబు అనే శాడిస్ట్ మేధావులు హిందూ సంస్కృతిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతినేలా చేసింది. ఒకడు రాముడిని అనరాని మాటంటే, ఇంకొకడు సీతమ్మపై అవమానకర రీతిలో మాట్లాడాడు. వీళ్ళిద్దరు కూడా ఇలా మాట్లాడి హిందువుల మనోభావాలను దెబ్బతీయాల్సిన అవసరం లేదు. దీనివల్ల వారికి గాని, సమాజానికి గాని వచ్చిన ఉపయోగం ఏమీ లేదు. మీరు రాముడిని నమ్మరు... రామాయణాన్ని నమ్మరు... దీనికి ఎవరూ అభ్యంతరం చెప్పడం లేదే. సమాజంలో దేవుడిని నమ్మని వాళ్ళు ఎంతోమంది వున్నారు. వాళ్ళెవరూ బలవంతం పెట్టడం లేదే! సరే టీవీ చర్చావేదికలలో హిందువులు ఆరాధించే దేవుళ్ళను తిడుతున్నారు. అదే నోటితో ఇతర మతాల జోలికి వెళ్ళగలరా? వీళ్ళకు అంత దమ్ముందా? వాళ్ళ జోలికి పోతే నలగదన్ని పెడతారు.

మతం అన్నది మత్తులాంటిదని కార్ల్ మార్క్స్ చెప్పాడు. నిజమే... ఈ మతం మత్తులో పడి చాలామంది కొట్టుకుంటున్నారు. చాలామంది ఛస్తున్నారు. ప్రతి మతంలోనూ మంచి వుంది, చెడు వుంది. అట్లాగే హిందూ మతంలోనూ కొన్ని దురాచారాలున్నాయి. వాటి వల్లే చాలామంది హిందూ మతం నుండి క్రైస్తవంలోకి మారారు. ఇప్పుడు హిందూ సంస్కృతిలోనూ ఆ దురాచారాలను రూపుమాపే దిశగా సంస్కరణలు మొదలయ్యాయి. ఏదన్నా వుంటే దురాచారాలు, మూఢనమ్మకాలపై పోరాడాలి. ప్రజల్ని ఆ దిశగా చైతన్యవంతుల్ని చేయాలి. మనిషికి గుండెపోటు వస్తే ఆసుపత్రికే తీసుకెళ్ళాలి, దేవాలయానికి కాదు. పాము కరిస్తే డాక్టర్ దగ్గరకు పోవాలి, మంత్రగాడి వద్దకు కాదు. ప్రజలకు ఇలాంటి వాటిపై అవగాహన కావాలి.

హిందూ సంస్కృతిలో మూఢనమ్మకాలను, దురాచారాలను పక్కనపెడితే ఆలోచించడానికైనా, అనుసరించడానికైనా ఎన్నో మంచిమార్గాలున్నాయి. మనిషిని మనిషిగా ఎలా బ్రతకాలో నేర్పేది ఈ సంస్కృతే! హిందూ సంస్కృతి, హిందూ ఆరాధన పద్ధతుల వల్లే ఈ దేశంలోనే కాదు, ప్రపంచ వ్యాప్తంగా కూడా ఎన్నో పుణ్యక్షేత్రాలు, దేవాలయాలు వెలిసాయి. వాటి కేంద్రంగానే కొన్ని కోట్ల మందికి పూజారులుగానో, పల్లకీ మోత వారిగానో, ఇ.ఓలుగానో, సూపరింటెండెంట్లుగానో, ఛైర్మన్‌లగానో, ధర్మకర్తలుగానో, మంగళవాయిద్యకారులుగానో, తలనీలాలు తీసే వాళ్ళుగానో... ఎన్నో రకాలుగా బ్రతుకుతున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉపాధి కల్పనా వేదిక హిందూ సంస్కృతి. ఈ సంస్కృతి ఆధారంగానే ఎన్నో విద్య, వైద్య సంస్థలు నెలకొల్పబడి సమాజంలోని పేదలకు, పీడితులకు సేవచేయగలుగుతున్నాయి. హిందూ సంస్కృతిలోని పరమార్థం మానవ సేవే మాధవ సేవ. హిందూ సంస్కృతి గురించి లోతుగా ఆలోచించేవారికి తప్పితే మందబుద్ధి కలిగిన వాళ్ళకు ఈ సంస్కృతి గొప్పతనం అర్థం కాదు.

# గెలుపుతోనే మలుపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం పట్ల ఆదరణ, అభిమానం ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో 294 అసెంబ్లీలు ఉండేవి. కాబట్టి ఇరవై, పాతిక సీట్లు దాకా నమ్ముకున్నోళ్ళకు ఇచ్చినా పెద్దగా సమస్య వచ్చేది కాదు. కాని, రాష్ట్రంలో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడున్నది 175 అసెంబ్లీ సీట్ల రాష్ట్రం. ప్రతి సీటులో గెలుపు ముఖ్యమే! గెలిచినా గెలవకపోయినా మనల్ని నమ్ముకున్నోడులే అని చెప్పి ఒక్క సీటు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. ఖచ్చితంగా గెలుస్తాడు, లేదా గెలుపు కోసం అన్ని విధాలా ప్రయత్నిస్తాడు అన్న అభ్యర్థినే రంగంలోకి దించాల్సిన పరిస్థితి.

వైకాపా అధినేతగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి వచ్చే అసెంబ్లీ ఎన్నికలే ఆఖరి మ్యాచ్. ఆ ఎన్నికల్లో గెలిస్తేనే రాజకీయ భవిష్యత్. రేపు కూడా అధికారంలోకి రాకుంటే ఇక పార్టీని నిలుపుకోవడం కష్టం. కాబట్టి అధికారమే లక్ష్యంగా రేపటి ఎన్నికల్లో పోరాడక తప్పదు. ఇందుకు ముందుగా 2014 ఎన్నికల్లో చేసిన పొరపాట్లను ఒకసారి పరిశీలించుకోవాలి. అప్పుడు వైసిపిలోకి వస్తామన్న చాలా మంది కాంగ్రెస్ సీనియర్ నాయకులను వద్దన్నారు. ఇక్కడ సీట్లు ఖాళీ లేవన్నారు. సీనియర్లు అయితే తనను లెక్క చేయడని, ద్వితీయశ్రేణి నాయకులను పైకి తీసుకురావాలని చెప్పి జగన్ ఎక్కువమంది సెకండ్ కేడర్ నాయకులకు సీట్లిచ్చాడు. 2014 ఎన్నికల్లో ఇక్కడే తేడా వచ్చింది. చంద్రబాబు సీనియర్‌లను, స్థానికంగా పట్టున్న నాయకులను, ఆర్థికంగా బలవంతులను అభ్యర్థులుగా రంగంలోకి దించాడు. జగన్ మాత్రం ఎక్కువ శాతం మంది సెకండ్ కేడర్ లీడర్లను అభ్యర్థులుగా దించాడు. తెలుగుదేశంకు బలమైన అభ్యర్థులే బలమయ్యారు. తెలుగుదేశం సాంప్రదాయ ఓట్లకు అభ్యర్థులు సొంతంగా మరికొన్ని ఓట్లు జోడించారు. వైసిపి అభ్యర్థులకు మాత్రం కేవలం వై.యస్. ఓట్లే దిక్కయ్యాయి. ఇక్కడే సీట్ల తేడా వచ్చింది. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం నుండి 103మంది ఎమ్మెల్యేలు గెలిస్తే అందులో దాదాపు 80మంది అభ్యర్థులు గట్టివాళ్ళు కావడం వల్ల గెలిచినవే! వైసిపి నుండి 67మంది గెలిస్తే కనీసం 50మంది వై.యస్. ఓట్ల వల్ల గెలిచిన వాళ్ళే! వీళ్ళకంటే మరీ వీక్‌గావున్నోళ్ళు ఓడిపోయారు. అదే మరో 50సీట్లలో గట్టి అభ్యర్థులను గెలుపు గుర్రాలనుకున్నవాళ్ళను రంగంలోకి దించుంటే ఫలితాలు ఇంకో రకంగా ఉండేవేమో? కనీసం వచ్చే ఎన్నికలలోనైనా గత తప్పిదాలను పునరావృతం చేయకుండా చూసుకోవాలి. పార్టీకి సేవ చేసిన వాళ్ళను గుర్తించి గౌరవించడానికి ఎన్నో మార్గాలున్నాయి. కాని పార్టీ అధికారంలోకి రావడానికి వున్న మార్గం అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడమొక్కటే! రాష్ట్రంలో 25లోక్‌సభ స్థానాలలో ఓడిపోయినా ఫర్వాలేదు.. 13జడ్పీలలో రాష్ట్రంలో వున్న అన్ని కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలు, జడ్పీటీసీలలో ఓడిపోయినా వచ్చిన ఇబ్బందేమీ లేదు. కాని, అసెంబ్లీలో మెజార్టీ సీట్లు వస్తేనే అధికారం. అంటే ప్రతి సీటులోనూ గెలుపు గుర్రాన్నే దించాలి. ప్రభుత్వ వ్యతిరేకత, జగన్ విశ్వసనీయత ఈసారి వైసిపికి కలిసొస్తాయి. అయితే పూర్తి స్థాయిలో ఇవి పార్టీని గట్టెక్కించలేవు. ఒక అసెంబ్లీలో లక్ష ఓట్లుంటే గెలవ దానికి 50వేల ఓట్లు కావాలి. పార్టీకి 40వేల ఓట్లు పడతాయనుకుందాం. ఏదో ఒక రూపంలో మిగతా 10వేల ఓట్లు అభ్యర్థులు తెచ్చుకోగలగాలి. అలాంటివారికే సీట్లివ్వాలి. అలాకాకుండా సీట్ల ఎంపికలో జగన్ 2014 పోకడలే ఈసారి కూడా అవలంభిస్తే అప్పటి ఎన్నికల ఫలితాలకు, రేపటి ఎన్నికల ఫలితాలకు పెద్ద తేడా వుండదు!

### శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజియ్యర్‌స్వామి పర్యవేక్షణలో...

# నేత్రపర్వంగా ధ్వజస్తంభ పునః ప్రతిష్ట



నెల్లూరుజిల్లా సోమశిల పినాకిని నది తీరంలోగల శ్రీ పరమానంద ఆశ్రమంలో వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డిల నేతృత్వంలో శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆళ్వారాచార్యుల ధ్వజ స్థంభ పునఃప్రతిష్ఠ, శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మీ నర సింహస్వామి జీర్ణోద్ధారణ పునఃప్రతిష్ఠ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి దివ్యమంగళా శాసనాలతో ప్రత్యక్ష పర్యవేక్షణలో నేత్ర పర్వంగా జరిగింది. గత నెల 27వతేదీ నుండి ఈ నెల 1వతేదీ వరకు అయిదురోజుల పాటు అత్యంత వైభ వంగా ఈ వేడుకలు జరగడం విశేషం. గత నెల 27వ తేదీ సాయంత్రం భగవతి ప్రార్ధన, విష్వక్సేన పూజ పుణ్యాహవాచనం, మృత్సంగ్రహణం అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయి. 28వ తేదీ ఉదయం సుప్రభాతసేవ తదితర కార్యక్రమాలు, 29వ తేదీ ఆధివాస హోమాలు పూర్ణా హుతి, తీర్ధ ప్రసాదగోష్టి, 30న మహాశాంతి జపం, కుంభారాధన, 1వ తేదీ ఉదయం 10.33 గంటలకు కుంభప్రోక్షణ కార్యక్రమాలు ఆలయ అర్చకులు ఈదూరు రామాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఈ సంద ర్భంగా గతనెల 29వతేదీ ఉదయం 10గంట లకు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వారు భక్తు లచే లక్ష్మీపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిరోజూ వేద ఇతిహాస పురాణ స్తోత్ర దివ్య ప్రబంధ పారా యణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్ధప్రసాదాలను స్వీకరించారు.



# ప్రశాంతతే.. మా లక్ష్యం!




**- జిల్లా ఎస్పీ రామకృష్ణ**

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, నిందితులను ఇక నుండి వీడియో కెమెరాల ముందు ప్రవేశపెట్టబోమని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ స్పష్టం చేశారు. మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఈనెల 4న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాను ప్రశాంతంగా ఉంచడమే తమ లక్ష్యమన్నారు. మనుబోలు మండలంలోని కొలనుకుదురు గ్రామంలో రైతుల నుంచి భారీగా డబ్బు వసూలు చేసి ఉడాయించిన వేల్పూరు గాంధీ కుటుంబంపై కేసు నమోదు చేశామన్నారు. బాధితులకు న్యాయం చేస్తామ న్నారు. హత్యలు జరిగినప్పుడు వాటి వీడియోలను టీవీల్లో చూపించడం వల్ల హింస పెరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల గురించి ప్రస్తావిస్తూ, డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. హైవేపై రోడ్డు దెబ్బతిన్నచోట్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అయితే అలాంటి చోట్లను గుర్తించామని, త్వరలో మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై కఠినచర్యలుంటాయన్నారు. నెల్లూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం అడ్వయిజరీ కమిటీని ఏర్పాటుచేశామని, ఈ కమిటీ సూచించిన 40 సూచనలు అమలుపరిచామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట గూడూరు డిఎస్పీ రాంబాబు, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.



**విప్లవ యోధుడు, స్వాతంత్ర్యపోరాట వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 4వ తేదీ నెల్లూరు జడ్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మరియు జడ్పీ సిబ్బంది**

# రాజకీయ దారులు వేరవుతాయా?



***నెల్లూరుజిల్లా రాజకీయాలంటే అగ్రవర్ణ నాయకులదే పెత్తనం. బెజవాడ, నల్లపరెడ్డి, ఆనం, నేదురుమల్లి, మాగుంట, మేకపాటి వంటి రాజకీయ కుటుంబాలు బలంగా వున్న ఈ జిల్లాలో ఓ దళిత మహిళ 5సార్లు వరుసగా నెల్లూరు లోక్‌సభ టిక్కెట్ తెచ్చుకుని అందులో నాలుగుసార్లు ఎంపీగా గెలిచి చూపించిందంటే... ఆషామాషీ విషయం కాదు. అందులోనూ యూపిఏ ప్రభుత్వంలో రెండుసార్లు కేంద్రమంత్రి కావడం... ఆ దళిత మహిళ ఎవరో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు... శ్రీమతి పనబాక లక్ష్మి.***

1992లో కాంగ్రెస్‌పార్టీ ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన పనబాక లక్ష్మి, నెల్లూరు లోక్‌సభ నుండి ఐదుసార్లు పోటీ చేసి నాలుగుసార్లు గెలవగా, 2009లో బాపట్ల నుండి ఎంపీగా గెలుపొందడం తెలిసిందే! కాంగ్రెస్‌పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన ఆమె జిల్లాలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని కూడా దాటుకునిపోయి యూపిఏలో కేంద్రమంత్రి కాగలిగారు. ఇప్పుడు సోనియాగాంధీ కోటరీలో ఆమెకు ఒక ముఖ్య సభ్యురాలు కూడా! తనతో పాటే తన భర్త పనబాక కృష్ణయ్యను కూడా ఆమె రాజకీయాల్లోకి లాగారు. 2009లో పనబాక కృష్ణయ్య రైల్వే ఉన్నతాధికారిగా స్వచ్ఛంధ పదవీ విరమణ చేసి గూడూరు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం, స్థానికంగా నెలకొన్న కాంగ్రెస్ వర్గ రాజకీయాల మూలంగా ఓడిపోవడం జరిగింది. ప్రస్తుతం పనబాక లక్ష్మీ కేంద్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకురాలిగా వుంటే, పనబాక కృష్ణయ్య మాత్రం నెల్లూరుజిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

అయితే ఏపిలో కాంగ్రెస్ ఇక బ్రతికి బట్ట కట్టే పరిస్థితి లేని తరుణంలో ఈ దంపతులు కాంగ్రెస్‌లోనే వుంటారా? లేక రాజకీయ ప్రత్యామ్నాయ దారులను చూసుకుంటారా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

వీళ్ళు పార్టీ మారితే చేర్చుకోవడానికి, సీట్లివ్వడానికి అటు అధికార తెలుగుదేశం, ఇటు ప్రతిపక్ష వైకాపాలు సిద్ధంగా వున్నాయని తెలుస్తోంది. అయితే కాంగ్రెస్‌ను వదిలి రావడానికి పనబాక లక్ష్మి సుముఖంగా లేనట్లు సమాచారం. ఆమె సోనియాకు సన్నిహితురాలిగా మారింది. ఆమెకిప్పుడు ఏపి రాజకీయాలతో అవసరం లేదు. ఏదో ఒకరోజు మళ్ళీ కాంగ్రెస్‌కు అధికారమొస్తుంది. ఆరోజు సోనియానే తనకు తగిన గుర్తింపునిస్తుంది. ఈలోపు ఏఐసిసి, సిడబ్ల్యూసి వంటి వాటిలో తనకు అధిక ప్రాధాన్యతనివ్వొచ్చు అనే ఉద్దేశ్యంతో పనబాక లక్ష్మి వుంది.

పనబాక కృష్ణయ్య మాత్రం రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనలో వున్నట్లు తెలుస్తోంది. అయితే అందుకు కాంగ్రెస్‌ను నమ్ముకుంటే దండగ. ఆయన ముందున్న మార్గాలు తెలుగుదేశం, వైకాపాలు. ఆయనకు సీటివ్వడానికి అవకాశముండేది గూడూరు అసెంబ్లీనే! తెలుగుదేశం వాళ్ళు వైసిపి గోడ దూకొచ్చిన సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కు సీటివ్వక తప్పదు. దీంతో కృష్ణయ్యకు వైకాపానే బెటర్ ఛాయిస్. ప్రస్తుతం గూడూరు వైకాపా ఇన్‌ఛార్జ్‌గా మేరిగ మురళీధర్ కొనసాగుతున్నాడు. ఆయనకే టిక్కెట్ ఇవ్వాలని మేకపాటి పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఆయనకే సీటిస్తే గూడూరులో వైసిపికి విజయావకాశాలు తగ్గుతాయి. ఆయన బదులు పనబాక కృష్ణయ్య అయితే గెలుపుకు అవకాశాలు మెరుగవుతాయి. గూడూరులో పరిచయాలున్న వ్యక్తి. అన్ని వర్గాలతో సత్సంబంధాలున్నాయి. గతంలో ఎలక్షన్ చేసి ఓడిపోయిన అనుభవం వుంది. కాబట్టి గూడూరు వైసిపికి ఆయనే అన్ని విధాలా బెటర్! మరి కాంగ్రెస్‌ను వదిలి ఆయన వైకాపాలోకి వస్తాడా? వచ్చినా వైసిపిలో సీటు ఇస్తారా? అన్నది ఇక ముందు తేల్చాల్సిన విషయాలు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com